ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (శుక్ర)
సహర్ : 4.44 (శని)



పెదవేగి మండలం కవ్వగుంట సమీపంలో కరిగిన పోలవరం కాల్వ గట్టు

మట్టి మేసేశారు!

పోలవరం కుడి కాల్వగట్లు మాయం



ఆంధ్రజ్యోతి విజిట్

ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి వద్ద అక్రమంగా తవ్వేసిన పోలవరం కాల్వ గట్టు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం ప్రాజెక్టు సమీపాన పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి ప్రకాశం బ్యారేజీ ఎగువ వరకు నిర్మించిన పోలవరం కుడికాల్వ గట్టు మట్టి వైసీపీ ఐదేళ్ల జమానాలో ఎంచక్కా మేసేశారు. వాటాలను పంచుకున్నారు. ఊళ్లకు ఊళ్లనే ఏమార్చి మట్టి దందా చేశారు. కాల్వ గట్టు పటిష్టతకు ఉద్దేశించి తవ్విన మట్టిని అక్కడికక్కడే గట్టు రక్షణకు వినియోగించారు. కానీ వైసీపీ నేతలు ఈ విషయాన్ని ఆసాంతం మరిచి కోట్ల రూపాయలు మట్టి వ్యాపారం మీద దండుకున్నారు. పోలవరం గట్టు సాగినా ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సాగించిన మట్టి దౌర్జన్యాలు అన్నీ ఇన్నీ కావు. అడ్డు తగిలిన వారిపై కేసులు పెట్టారు. మరికొందరిని పరోక్షంగా బెదిరించి లొంగదీసుకున్నారు. అధికారుల కళ్లకు గంతలు కట్టారు. ఇంకొందరికి జేబులు నింపారు. దందా అంతా సాఫీగా సాగేలా ఆనాటి స్థానిక అధికారులు వంత పాడారు. పోలవరం కుడి కాల్వకు రక్షణగా ఉన్న మట్టి గట్లు ఇప్పుడు ఎక్కడికక్కడ అదృశ్యమయ్యాయి.

- ఐదేళ్లపాటు వైసీపీ అరాచకం
- కోట్ల రూపాయల మేర దండుకున్నారు
- అడ్డొచ్చిన వారిమీద అక్రమ కేసులు
- ఇప్పుడు ఎక్కడ చూసినా బోడిగట్లే..

రైతులు వెంటాడి అడ్డుకున్న ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నేతలే బెదిరించి మరీ జేబులు నింపుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' బృందం కాల్వ గట్ల వెంబడి విజిట్ చేయగా ఆనాటి వైసీపీ బాగోతం నేడు బహిర్గతం అయ్యింది.

గుట్టుగా కరిగిన గట్టు

పెదవేగి : మండలంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం కుడికాల్వ గట్టును రాత్రి, పగలు తేడాలేకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకుని గుటకాయ స్వాహా చేశారు. ప్రస్తుతం కాల్వకు ఇరువైపులా గట్టు కనిపించనంతగా తవ్వేసి కోట్లు దండుకున్నారు. అప్పట్లో మట్టి దందా అడ్డుకున్న టీడీపీ నాయకులను వెంటాడి తరిమి కొట్టి మరీ మట్టి దందా సాగించారు. లక్ష్మీపురం సమీపంలో కాల్వ గట్టును తవ్వేస్తున్నారని, అడ్డుకోబోయిన పెదవేగికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తాతా సత్యనారాయణ, దెందులూరు మండలం జోగన్నపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధు, మరికొంతమంది టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపర్చారు. వాహనాలు ధ్వంసం చేశారు. లక్ష్మీపురం దగ్గరే మరో ప్రదేశంలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న ఆ గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకుడు మేకా కనకరాజును ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తామంటూ వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన సంబంధితశాఖాధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కాల్వ ఇరువైపులా గట్టు ఉండాల్సిన ప్రదేశంలో గుంతలు కనిపిస్తున్నాయి. భవిష్యత్‌లో కుడి కాల్వకు భారీగా నీరు విడుదలైతే దిగువ గ్రామాలకు వరద ముంపు ప్రమాదం పొంచి ఉంటుందనే భయాన్ని ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



ఉంగుటూరు మండలంలో పోలవరం కాల్వగట్టు వద్ద అక్రమంగా కంకర తవ్వకం

కంకర అక్రమ తవ్వకాలు

ఉంగుటూరు : మండలంలో పోలవరం కాల్వగట్టును అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. కంసాలిగుంట, నల్లమాడు రెవెన్యూ పరిధిలో 2.750 కి.మీల పరిధిలో పోలవరం

ఎర్ర కంకరపై కన్ను

కుడికాల్వ ఉండగా ఈ ప్రాంతంలో ఎర్ర కంకర లభ్యమవడంతో అక్రమార్కుల కన్ను దానిపై పడింది. మండలంతో పాటు భీమడోలు, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 21.750 కి.మీ పొడవునా పోలవరం కుడికాల్వ ఉండగా గట్ల నిర్వహణ సిబ్బంది తక్కువగా ఉండడం అక్రమార్కులకు కలిసొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో గట్టు దిగువన కొంత మేర కంకర తవ్వేందుకు అనుమతి తీసుకున్నారు. అయితే ఇష్టారాజ్యంగా గట్టును సైతం తవ్వేస్తూ కంకరను తరలించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఇంకా అక్రమార్కులు రాత్రిళ్ళు ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లలో పెద్దఎత్తున్న తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు దాడులు జరిపినా నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువైన ఎర్ర కంకరను అక్రమంగా తరలించడంపై స్థానికులు అనేకమార్లు ఫిర్యాదులు చేసినా ఎటువంటి ఫలితం లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎర్ర కంకర బదులు తెల్ల సున్నపు రాయి మిగిలింది.

టిప్పర్ సీజ్.. డ్రైవర్ పరారీ

ఉంగుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపీనాథపట్నం కాలనీ వెనుక భాగంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కంకర తవ్వకాలు నిర్వహిస్తుండగా బుధవారం రాత్రి వీఆర్వో దుర్గా ప్రసాద్ దాడులు జరిపి కంకర లోడుతో ఉన్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ టిప్పర్ తాళాలతో ఉడాయించాడు. ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర వర ప్రసాద్ మాట్లాడుతూ టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కాసుల వర్షం..

దెందులూరు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం కుడి కాల్వ గట్టు ఆక్రమార్కులకు, వైసీపీ నాయకులకు కాసుల వర్షం కురిపించింది. ఒకవైపు మట్టిని (గ్రావెల్)ను తవ్వి గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తుంటే మరో వైపు ఆ ప్రాంతాన్ని ఆక్రమించి పశువులకు షెడ్లు, వ్యవసాయ పంటలైన అరటి, పామాయిల్, నిమ్మ మొక్కజొన్న పంటలు వేశారు. గ్రామాల్లోని చెరువుల్లో యథేచ్ఛగా మట్టిని తవ్వేసి రూ.50 కోట్ల వరకు సొమ్ము చేసుకున్నారు. మేదినరావుపాలెం పరిధిలో గత ప్రభుత్వంలో వైసీపీలో కీలకంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తక్కువ తీసుకుని ఎక్కువ తవ్వేశారని ఆరోపణలు ఉన్నాయి. పంగిడిగూడేంకు చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి ఇష్టారాజ్యంగా మట్టిని తరలించారనే ఆరోపణలు వినిపించాయి. మట్టి తవ్వకాలను ప్రశ్నించి అడ్డుకున్న టీడీపీ నాయకులపై దాడులు చేసి కేసులు నమోదు చేయించి భయాందోళనకు గురి చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి వేళల్లో మట్టిని అక్రమంగా కొంతమంది తరలించుకు పోతున్నారు.



మేదినరావుపాలెం వద్ద మట్టి కోసం తవ్వేసిన పోలవరం కాల్వ గట్టు



మెట్టపంగిడిగూడెం వద్ద ఇలా..

మట్టిని తరలిస్తే కేసులు

దెందులూరు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు పోలవరం కాల్వ గట్టు గ్రావెల్‌ను అమ్మి రూ.50 కోట్లు సంపాదించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎవరైనా పోలవరం కాల్వ గట్టు మట్టి, గ్రావెల్‌ను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారం. మా పార్టీ వారైనా నిబంధనలు దాటి వ్యవహరిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం.

- చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే

ప్రభుత్వం మారినా ఆగని దందా

ద్వారకాతిరుమల : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల మట్టి దోపిడీకి అంతే లేకుండా పోయింది. పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్లను దర్జాగా తవ్వేయడంతో గట్లు కుచించుకుపోయాయి. అప్పట్లో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని కొల్లగొట్టి కాసుల వేటకు తెరలేపారు. మండలంలోని ఎం.నాగుల పల్లి, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి, నారాయణ పురం తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ కొంతమంది రాజకీయ నేతల కనుసన్నలలో పోలవరం కుడికాల్వ గట్ల వెంబడి ఈ మట్టి దందా యథేచ్ఛగా జరుగుతోంది. పోలవరం కాల్వ గట్లతో పాటు పంచాయతీ చెరువులను సైతం సదరు అక్రమార్కులు వదలడం లేదు. అయినా సంబంధిత శాఖల అధికారులు మామూళ్ల మత్తులో ఏ చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఉమ్మడి పశ్చిమలో పంచాయతీ

ఉప సర్పంచ్‌లకు ఉప ఎన్నికలు

- 27న ప్రత్యేక సమావేశం
- ఏలూరు జిల్లాలో 11, పశ్చిమలో 17 స్థానాలు ఖాళీ

ఏలూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ని పంచాయతీలలో ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేసింది. ఈనెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఈ ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లాలో 11, పశ్చిమ గోదావరి జిల్లాలో 17 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

- ఏలూరు జిల్లాలోని ముదినేపల్లి మండలంలోని ప్రొద్దువాక, చింతలపూడి మండలంలోని రేచర్ల, మండవల్లి మండలం ముదుతల్లపాడు, లోకమూడి, పెదవేగి మండలం రామసింగవరం, కొండలరావు పాలెం, దెందులూరు మండలం దెందులూరు, నిడమర్రు మండలంలోని ఎనికేపల్లి, అడవికొలను, కలిదిండి మండలం భాస్కర రావుపేట, కొయ్యలగూడెం మండలం అచ్చుతాపురం పంచాయతీలలో ఉప సర్పంచ్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం మండలంలో మల్లవరం, గొంది, భీమవరం మండలం గొల్లవానితిప్ప, గూటపాడు, ఎల్‌వీఎన్ పురం, తుందుర్రు, బేతపూడి, అత్తిలి మండలం కేఎస్ గట్టు, ఇరగవరం మండలం కొత్తపాడు, మొగల్తూరు మండలం కేపీపాలెం సౌత్, పేరుపాలెం సౌత్, పాలకొల్లు మండలం అగర్తిపాలెం, గోరింటాడ, ఉండి మండలం ఎన్‌ఆర్‌ఆర్ అగ్రహారం, వీరవాసరం మండలం పెరికేపాలెం, యలమంచిలి మండలం అబ్బిరాజు పాలెం, పాలకోడేరు మండలం గొరగనమూడి పంచాయతీల్లో ఉపసర్పంచ్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

వైసీపీ ఆగమాగం

ఏలూరులో తాజాగా రాజీనామాలు, సస్పెన్షన్‌లు

ఇదేం వైఖరంటూ పార్టీపై కేడర్ మండిపాటు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిని మూటకట్టుకున్న వైసీపీ పరిస్థితి అంతకంతకు దిగజారుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను నడిపిన సీనియర్లంతా ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతూనే ఉన్నారు. మరి కొందరిని క్రమశిక్షణ పేరిట బయటకు వెళ్లేలా చేస్తున్నారు. ఇప్పటికే ఐదేళ్లల్లో వైసీపీలో ఉండి నానా యాగీ చేసిన కొందరు నేతలైతే నేరుగా టీడీపీ పక్షాన చేరి తమ తప్పొప్పులను కప్పిపుచ్చు కునే ప్రయత్నం చేశారు. ఏలూరు జిల్లాలో వైసీపీ ఈ దెబ్బతో ఆగమాగం అయ్యింది.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గత ఎన్నికల్లో ఓటమి పొందిన వైసీపీ తనంతట తానుగా నిలదొక్కుకోవాల్సింది పోయి ఆఖరుకు కేడర్‌నే కోల్పోయేలా తప్పటడుగులు వేస్తోంది. పై నుంచి కింది వరకు నాయకత్వ లేమి ఎదుర్కొంటున్న తరుణంలో సీనియర్లంతా ఇప్పటికే ఒక్కొక్కరుగా జారుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు నియోజకవర్గాల పరిధిలో ఆ పార్టీ పరిస్థితి ఇప్పుడు అత్యంత దారుణంగా మారింది. ఉన్న నియోజకవర్గ కన్వీనర్లు పార్టీ వ్యవహారాలపై పూర్తిగా దృష్టి పెట్టలేక పోతున్నారు. కేడర్ తగ్గుతున్నా దీనికి తగ్గట్టుగా నాయకత్వం నిలదొక్కుకోలేని స్థితికి చేరింది. ఏలూరులో ఆ పార్టీ ఇప్పటికే కుప్పకూలింది. పార్టీ సీనియర్లు యావత్తు ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు నెలల్లోపే ఫ్యాన్ కింద నుంచి వైదొలిగి సైకిల్ ఎక్కారు. పార్టీకి పెద్ద దిక్కు ఆళ్ల నాని టీడీపీలో చేరారు. ఇంత జరిగినా ఆ పార్టీలో మార్పు రాలేదన్నట్టు సీనియర్ మహిళా నేత పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందునే సస్పెండ్ చేశామంటూ వైసీపీ ప్రకటించింది. వాస్తవానికి శ్రీలక్ష్మి చాన్నాళ్ల నుంచి ఏలూరు అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తూ వచ్చారు. మహిళా నేత, బీసీ ప్రతినిధిగా తనకు అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టారు. ఇది నచ్చని చాలా మంది ఆమె పార్టీలో బలపడకుండా సాధ్యమైనంత వరకు ప్రయత్నించారు. ఇప్పటికే సీనియర్లంతా పార్టీ నుంచి వైదొలిగిన నేపథ్యంలో ఉన్న ఒక్క నేతను పార్టీయే సస్పెండ్ చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో శ్రీలక్ష్మిని తమ పార్టీలోకి రావాల్సిందిగా కొన్ని పార్టీల నేతలు పరోక్షంగా ఆహ్వానించారు.



- ఏలూరు కార్పొరేషన్‌లో ఒకనాడు బలంగా ఉన్న ఆ పార్టీ ఇప్పుడు దీనావస్థకు వచ్చింది. కార్పొరేషన్ ఎన్నికల్లో 50 కార్పొరేటర్ల స్థానాలకు 47 స్థానాల్లో అప్పట్లో వైసీపీ విజయం సాధించింది. తాజా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమితో మేయర్ నూర్జహాన్‌తోపాటు ఆమె భర్త పెదబాబు, మరి కొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. వివిధ డివిజన్లలో నెలకొన్న స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కొందరు టీడీపీలోకి వద్దామనుకున్న వైసీపీ కార్పొరేటర్లకు ఎమ్మెల్యే బడేటి చంటి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఈ తరుణంలోనే వైసీపీ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి తాజాగా పార్టీకి రాజీనామా చేశారు. మరికొందరు త్వరలోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.
- చింతలపూడి నియోజకవర్గంలోను ఆ పార్టీ ఇప్పటికీ దీనావస్థలోనే ఉంది. కొందరు నేతలు పార్టీ అధినేత జగన్‌ను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అది సాధ్యం కావడం లేదు. దీనికితోడు దిగువ స్థాయిలో తెలుగుదేశం, జనసేన దూసుకు పోతుండడంతో వారికి ఎదురెళ్లేదానికంటే కలిసి వెళ్లడమే మంచిదన్న ధోరణిలో కొందరు, కొంతకాలం సైలెంట్ అయితే బెస్ట్ అని ఇంకొందరు ఇప్పటికే నిర్ణయాలు తీసుకున్నారు.

కేడర్ ఉన్నా నేతలే కరువు

ఇప్పుడు వైసీపీ విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటోంది. క్షేత్రస్థాయిలో వైసీపీని అభిమానించే వారున్నా వారందరిని ఏకతాటి మీదకు తీసుకొచ్చే నాయ కత్వం లోపించింది. గత ఓటమి నుంచి తేరుకోని అనేకమంది ఇప్పటికే సైలెంట్ అయ్యారు. కనీసం పార్టీ కార్యక్రమాలు అమలు చేసేందుకు ధైర్యం చేయడం లేదు. నియోజకవర్గ స్థాయిలో కనీసం పార్టీ కేడర్‌తో మమేకమయ్యేందుకు నియోజకవర్గ నాయకత్వం వెనకాడుతోంది. ఈ మధ్యనే వరుసగా పార్టీ అనేక పిలుపులిచ్చినా జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి కేవలం కొందరు కన్వీనర్లు మాత్రమే హాజరయ్యారే తప్ప కేడర్‌ను రప్పించలేకపోయారు. ఉంగుటూరు, దెందులూరు, పోలవరం నియోజక వర్గాల్లో వైసీపీ క్షేత్రస్థాయిలోను పూర్తిగా సైలెంట్ అయ్యింది. ఆయా నియోజక వర్గాల్లో టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు బలంగా మారుతుండడంతో వైసీపీ వీరి ధాటికి ఎదురు తిరగలేని బలహీన స్థితికి వెళ్లింది. ఏలూరులో పార్టీలో దాదాపు సీనియర్లతోపాటు జూనియర్లంతా ఖాళీ అయ్యారు. నియోజకవర్గ కన్వీనర్‌గా ఉన్న జయప్రకాశ్ కొంతలో కొంత పార్టీని నడిపించ డానికి ప్రయత్నిస్తున్నారు. నూజివీడులోను పరిస్థితి అంతంతమాత్రమే. ఇంతకు ముందు చురుగ్గా వ్యవహరించిన వారంతా పార్టీ అనుసరిస్తున్న తాజా వైఖరిపై గుర్రుగా ఉన్నారు. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నూరిపోయాల్సింది పోయి పార్టీ ఎందుకిలా వ్యవ వారిస్తుందన్న దానిపై మండిపడుతున్నారు.



మత్తు పదార్థాల నివారణే లక్ష్యం : కలెక్టర్

ఏలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అప్రమత్తతే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సమావేశం గురువారం జరిగింది. ఎస్పీ కేపీఎస్ కిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారి కె.రత్నప్రసాద్‌తో కలిసి ఆమె సమీక్షిం చారు. డ్రగ్స్ నివారణ, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1972పై విస్తృత ప్రచారానికి సంబంధించిన స్టిక్కర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, డీఆర్వో విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయవద్దు..

వేసవిలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే ఆయా అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. తాగునీటి సరఫరాపై ఆమె సమీక్షిస్తూ తాగునీటి సరఫరాపై వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, ఐటీడీఏ పీవో రాములు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం అమ్మేదెలా?

వరి కుప్పల నూర్పిళ్లు ప్రారంభం.. కొనుగోళ్లు నిలిపివేత.. మళ్లీ అనుమతులు ఎప్పుడో ?

ముదినేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖరీఫ్ ధాన్యం అమ్మకాల్లో సందిగ్ధత ఏర్పడింది. రైతుల వద్ద అమ్మకానికి ధాన్యం ఉండడం, మరోవైపు పౌర సరఫరాల శాఖ కొనుగోళ్లను నిలిపివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. తిరిగి ధాన్యం కొనుగోళ్ల ఎప్పుడు ప్రారంభమవుతుతాయన్నది స్పష్టత లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలో ఇంకా అమ్మాల్సిన ధాన్యం సుమారు 3 వేల మెట్రిక్ టన్నులు ఉంది. గతంలో మినుము సాగు వల్ల మండలంలోని పలు గ్రామాల రైతులు వరిపైరును పొలాల్లో కుప్పలుగా వేశారు. మినుము పైరు తీత ముగుస్తుండటంతో వరి కుప్పల నూర్పిళ్లను రైతులు ప్రారంభించి ధాన్యం రాశులను సిద్ధం చేశారు. అయితే ధాన్యం అమ్మకాలకు అవకాశం లేకుండాపోయింది. ఈనెల 15తో జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. రైతులు ప్రైవేట్‌గా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 కేజీల బస్తా రూ.1725కు కొనుగోలు చేయాలి. పౌరసరఫరాల శాఖ కొనుగోళ్లను నిలిపివేయడంతో ప్రైవేట్ వ్యాపారులు బస్తా రూ.1600 వరకు అడుగుతున్నారు.




మంచు ముత్యాలు

ప్రకృతిలో అందాలెన్నో.. వాటిని చూసినప్పుడు మనసు పరవశిస్తుంది..తెలతెలవారుతుండగా పల్లెదారుల్లో పంటచేలో వరి కంకుల నుంచి, చెట్ల కొమ్మల నుంచి మంచు బింధువులు ముత్యాల్లా రాలుతుంటే ఆ దృశ్యాలు కంటికి విందే..




తాడేపల్లిగూడెం- భీమవరం దారిలో మంచు దృశ్యాలు / ఫోటోలు : భీమవరం ఫోటోగ్రాఫర్




సైకిల్ యాత్ర చేస్తున్న సీఐఎస్ఎఫ్ పోలీసులు.. కొత్తోటలో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సాగర తీరానికి చేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ యాత్ర

నరసాపురం /మొగల్తూరు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సురక్షిత తీరం..సమృద్ధి భారత్ పేరుతో దేశవ్యాప్తంగా సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం నరసాపురం చేరుకుంది. పట్టణంలోని ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్ వద్ద వివిధ పార్టీల నాయకులు, పోలీసులు, సీఐఎస్ఎఫ్ జవాన్లు యాత్రకు స్వాగతం పలికారు. సంఘ విద్రోహశక్తులు, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర చేశారు. అనంతరం టెంపుల్ ల్యాండ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐఎస్ఎఫ్ లెఫ్టినెంట్ కమాండర్ ఎస్‌కె సత్‌పతి మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ 56వ అవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 6న సైకిల్ యాత్ర చేపట్టారు.ఈ యాత్ర ఈనెల 30న కన్యాకుమారిలో ముగుస్తుందన్నారు. జనసేన నాయకులు బొమ్మిడి సునీల్, పోలిశెట్టి శ్రీనువాస్, కమిషనర్ అంజయ్య, సీఐఎస్ఎఫ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. 216 జాతీయ రహదారి మీదుగా మొగల్తూరు మండలంలోని కొత్తోట గ్రామానికి చేరిన సిబ్బందికి గ్రామ జనసేన నాయకులు, ఆక్వా ఎక్స్‌పోర్టర్ సత్తినేని శ్రీనివాస తాతాజీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వారికి శీతల పానీయాలు అందించారు. ఈ బృందం వెంట మొగల్తూరు ఎస్ఐ జి.వాసు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురువారం వివిధ విభాగాల్లో గెలిచిన విజేతలతో నిర్వాహకులు

ఫైనల్స్‌కు సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు

భీమవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఐదు రోజులుగా సాగుతున్న వెర్టెక్స్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు ఫైనల్స్‌కు చేరాయి. గురువారం కొన్ని విభాగాలలో గెలుపొందిన వారిని విజేతలుగా ప్రకటించారు. 75+ డబుల్స్ విభాగంలో అశోక్‌రెడ్డి, సాయి రాంబాబు, 70+డబుల్స్‌లో సన్యాసీరాజు, గజపతిలు నిలిచారు. అలాగే 65+ డబుల్స్‌లో ఆనంద్ స్వరూప్, శ్రీనివాస్, 70+ సింగిల్స్‌లో సెట్టు, 65+సింగిల్స్‌లో శ్రీనివాసరెడ్డి విజయం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు.



క్లాప్ కొడుతున్న సినీ నిర్మాత అంబికా కృష్ణ

ఏలూరులో సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం

ఏలూరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అనన్య మూవీలో విలన్‌గా నటించిన అరవింద్ జాల హీరోగా సస్పెన్స్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. శ్రీసిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై గురువారం ఏలూరు రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముహూర్తపు సన్నివేశానికి సినీ నిర్మాత అంబికా కృష్ణ క్లాప్ కొట్టారు. ఎమ్మెల్యే బడేటి చంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దర్శక, నిర్మాతలు వెంకటేష్ జుత్తిగ, వట్టి శ్యాంబాబు మాట్లాడారు. సస్పెన్స్, థ్రిల్లర్, హర్రర్, సెంటి మెంట్‌తో పాటు నవరసాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు.


వైఎస్సార్ నుంచి వైసీపీ వరకు కొల్లేరుపై రాజకీయాలే : జనసేన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కొల్లేరు ప్రాంతంలో నెలకొన్న సమస్యాత్మక పరిస్థితులకు మూల కారణాలను అన్వేషించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనసేన పార్టీ అభిప్రాయ పడింది. కొల్లేరు స్థితిగతులపై పార్టీ అధినాయకత్వం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. కొల్లేరు పేరుతో 2006లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం భయానక రీతిలో నాటు బాంబులతో కొల్లేరులోని చెరువు గట్లను పేల్చేసిన విధానం నుంచి వైసీపీ నాయకులు కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకొస్తామన్న ప్రకటన వరకు జరిగిన పరిణామాలతో పాటు 2001లో చంద్రబాబు ప్రభుత్వం కొల్లేరు ప్రాంతంలో చేపట్టిన అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వైసీపీ ప్రభుత్వం ఏ దశలోను కొల్లేరు ప్రజల జీవనోపాధి గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. పైగా కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకొస్తామని ప్రకటనలు గుప్పించారని దుయ్యపట్టింది. కొల్లేరు సమస్య సంక్లిష్టం కావడంలో వైఎస్సార్ నుంచి వైసీపీ వరకు ప్రతిదశలో వారి రాజకీయ అవసరాలకు ఆడిన ఆటలే కారణ మని ఆ ప్రకటనలో ఎద్దేవా చేశారు. సంక్లిష్ట సమస్యలను పరిష్కరించిన అనుభవం సీఎం చంద్రబాబుకు ఉందని, కొల్లేరు సమస్యను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.

పట్టణాలకు గోదావరి జలాలు



విజ్జేశ్వరం నుంచి నేరుగా మళ్లించేందుకు కసరత్తు
భీమవరం, నర్సాపురం పట్టణాలను కలిపే యోచనలో ప్రభుత్వం
వాటర్ గ్రిడ్..లేదా ప్రత్యేక పైప్‌లైనా
తర్జనభర్జన పడుతున్న అధికారులు




(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నా జిల్లా ప్రజలకు రక్షిత మంచినీరు గగనమవుతోంది. కాలువలు కాలుష్య కారకాలుగా మారి పోయాయి. మురుగునీరు కలిసిపోతోంది. పరిశ్రమల వ్యర్థాలను కూడా కాలువల్లో కలిపేస్తున్నారు. కాలువల పక్కన ఉండే ఆవాసాల నుంచి మురుగు పైప్‌లైన్‌ల నుంచి నీరు కలిసిపోతోంది. దాంతో ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. జిల్లాలో ప్రతిఏటా తాగునీటి కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్‌లకు డిమాండ్ పెరుగు తోంది. పుట్టగొడుగుల్లా ప్లాంట్‌లు పుట్టుకొస్తు న్నాయి. తాగునీటి కష్టాలను అరికట్టి గోదావరి జలాలను శుద్ధిచేసి నేరుగా సరఫరా చేయాలని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత తెలుగుదేశంలోనే వాటర్ గ్రిడ్ పథకానికి రూపకల్పన చేసింది. కేవలం పల్లెలకు మాత్రమే మంచినీరు సరఫరా చేసే వాటర్ గ్రిడ్‌కు రూపకల్పన చేసింది. పట్టణాలను మినహాయించారు. దాంతో ప్రత్యేకంగా పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, నిడదవోలు, పాలకొల్లు పట్టణాలకు గోదావరి నుంచి నేరుగా శుద్ధి జలాలు ఇవ్వాలని పైప్‌లైన్ ప్రాజెక్ట్‌కు గత టీడీపీ హయాంలో కసరత్తు చేశారు. సుమారు రూ. 226 కోట్లతో ప్రాజెక్ట్ సిద్ధం చేశారు. టెండర్‌లు ఖరారు చేశారు. ఏజన్సీని నిర్ధారిం చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టేసింది.ప్రస్తుత ప్రభుత్వంలో పైప్‌లైన్ ప్రాజెక్ట్ మళ్లీ తెరపైకి వచ్చింది. గత ప్రాజెక్ట్‌ను నిలిపివేశారు. కొత్తగా భీమవరం, నర్సాపురం పట్టణాలను కూడా కలిపి పైప్‌లైన్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఆ దిశగా ప్రజారోగ్య శాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

రెండో పైప్‌లైన్ ఆవశ్యకత ఎంత!

జిల్లాలోని గ్రామాలకు వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు కసరత్తు పూర్తయ్యింది. ఏజన్సీని ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు రూ. 1428 కోట్లతో గోదావరి నుంచి పైప్‌లైన్ ప్రాజెక్ట్ ద్వారా నేరుగా మంచినీటిని సరఫరా చేయనున్నారు. త్వరలోనే అవార్డు ప్రకటిస్తారు. ఆ తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి. దీనికోసం ప్రధాన పైప్‌లైన్ ఉంటుంది. వాటర్‌గ్రిడ్‌లో పట్టణాలు లేవు. ప్రస్తుతం జిల్లాలోని తణుకు, భీమవరం, పాలకొల్లు, నర్సాపురం పట్టణాలకు పైప్‌లైన్ ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని సంకల్పించారు. దాంతో కొత్తగా మరో పైప్‌లైన్ వేయాల్సిన అవసరం ఉంటుంది.రెండో పైప్‌లైన్ వేసేందుకు పెద్దమొత్తంలోనే వ్యయం కానుంది. ఫలితంగా వాటర్ గ్రిడ్‌లోనే కల పడమా..లేదా మరో పైప్‌లైన్ వేయడమా అనే విషయమై ప్రజారోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. రెండో పైప్‌లైన్ కుండా వాటర్ గ్రిడ్‌లోనే కలిపి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సమీక్షలో ఇదే విషయాన్ని ప్రస్తావించి నట్టు అధికారులు చెపుతున్నారు. మొత్తంపైన పట్టణాలకు పైప్‌లైన్ ప్రాజెక్ట్ మళ్లీ మొదటి కొచ్చింది. పాలకొల్లు, తణుకు, నిడదవోలు పురపాలక సంఘాలకు గతంలో నిర్ణయించిన పైప్‌లైన్ ప్రాజెక్ట్ మరుగన పడింది. కొత్త ప్రణాళికలతో అధికారులు ముందు కొస్తున్నారు. కార్యరూపం దాలిస్తే జిల్లాలోని పట్టణ ప్రజలకు కూడా నేరుగా గోదావరి నుంచే శుద్ధి చేసిన జలాలను అందించే అవకాశం ఉంటుంది.

బయట తింటే ఆరోగ్యం గల్లంతే..



గూడెం ఒక హోటల్‌లో నిల్వ ఉన్న మాంసాహారం

పుట్టగొడుగుల్లా రెస్టారెంట్లు, దాబాలు
యథేచ్ఛగా కల్తీ, నిషేధిత ఆహార పదార్థాల వినియోగం
ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
అసెంబ్లీలో ప్రస్తావించిన గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెంలోని ఓ రెస్టారెంట్‌లో ఇటీవల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడి చేశారు. అక్కడ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విస్తుపోయేలా కుళ్లిన చికెన్, వాడేసి వాడేసిన ఆయిల్, నిషేధిత టేస్టింగ్ సాల్ట్ ఇలా చాలానే కంటపడ్డాయి. దీంతో ఆ రెస్టారెంట్‌కు నోటీసులిచ్చారు. ఒక తాడేపల్లిగూడెంలోనే కాదు. జిల్లాలో అధిక శాతం రెస్టారెంట్‌లలో ఇదే పరి స్థితి ఉందని ఆ ఫుడ్ ఇన్‌స్పెక్టరే నిట్టూర్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఫుడ్ కల్తీ, టేస్టింగ్ సాల్ట్ వాడకంపై అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రస్తావించారు. జిల్లాలో ఒకే ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నాడని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు హోటల్స్‌పై నిఘా పెట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యంపై ఫాస్ట్‌ఫుడ్ ఎంత ప్రభావితం చేస్తోందో తెలుస్తోంది. ఉరుకులు పరుగుల జీవితం.. ఉద్యోగాలు చేసుకునేవారు ఎక్కువ శాతం ఇంటి భోజనం వదిలి పెట్టి బయటి భోజనాలకు అలవాటు పడ్డారు. ఉదయం ఇంట్లో టిఫెన్ దగ్గర నుంచి భోజనాల వరకూ అన్ని బయటవే. పుట్టినరోజు, పెళ్లిరోజు, వేడుక, సందర్భం ఏదైనా రెస్టారెంట్‌లు, హోట ల్స్‌కు వెళ్లి కుటుంబంతో కలిసి భోజనం చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఇలా బయట ఫుడ్ తినడం అంటే చాలా రోగాలను కొని తెచ్చుకున్నట్టే.

కనిపించేదంతా కల్తీనే

హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు భోజనాల తయారీలో నేరూరించే మసాలాలు, రంగులను వాడుతున్నారు. ఘుమఘుమలాడే రుచుల వెనుక అసలు విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలు, బేకరీలే కాకుండా ఆహార పదార్థాలు విక్రయించే అనేక దుకాణాల్లో కల్తీ రాజ్యమేలుతోంది. తినేతిండి కల్తీ కాకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారుల తనిఖీలు లేవని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కన బజ్జీల బండి నుంచి హోటల్స్ వరకూ నూనె రోజుల తరబడి ఉపయోగిస్తుంటారు. నూనెను ఒకటి రెండు సార్లకు మించి మరగ కాచి వినియోగిస్తే క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యలు వాటిల్లుతాయని నిపుణులు చెబుతున్నారు.

పుట్టగొడుగుల్లా హోటల్స్

జిల్లాలో ప్రస్తుతం హోటల్స్, రెస్టారెంట్‌లు, బేకరీలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, దాబాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంతో పాటు పరిసర పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో అత్యధికంగా దాబాలు, హోటల్స్ వెలిశాయి. ఇటీవల కాలంలో 10కి పైగా దాబాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు స్వీట్ స్టాల్స్ వెలిశాయి. జనం రుచికరమైన ఆహారానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా హోటల్స్ పుట్టుకొస్తున్నాయి.

లైసెన్స్ పొందినవి రెండు వేలే

జిల్లాలో స్వీట్ స్టాల్స్ ,హోటల్స్, రెస్టారెంట్‌లు, కిరాణా షాపులు, బేకరీలు అన్నింటికి తీసుకోవాల్సిన ఫుడ్ లైసెన్స్ కేవలం 2 వేల మందే తీసుకున్నారు. ఒక్కో పట్టణంలో భారీగా ఉండే దుకాణాలు, రెస్టారెంట్‌లతో కలిపితే ఒక్క పట్టణంలోనే వెయ్యికి దగ్గరగా ఉంటాయి. లైసెన్స్ పొందినవి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు వేలు ఉండటం గమనార్హం.

ప్రజల ఆరోగ్యం ముఖ్యం



ప్రజల ఆహారం అలవాట్లకు అనుగుణంగా హోటల్స్‌లో ప్రజల ఆరోగ్యం హరించే టేస్టింగ్ సాల్ట్ లాంటివి వాడుతున్నారు. ప్రధానంగా హోటల్స్‌పై పర్యవేక్షణ ఉంచి హానికరమైన పదార్థాలు వాడకుండా ముమ్మర తనిఖీలు చేపట్టాలి. ప్రజల ఆరోగ్యం పరిరక్షించడం మన బాధ్యత.

- బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే తాడేపల్లిగూడెం

ఈ ఏడాది 33 కేసులు నమోదు



జిల్లాలో ఈ సంవత్సర కాలంలో 177 దుకాణాల్లో రైడ్ నిర్వహించాం. వాటిలో 33 కేసులు నమోదు చేశాం. అన్ని పట్టణాల్లో లైసెన్స్‌డ్ హోటల్స్, రెస్టారెంట్‌లు, స్వీట్ స్టాల్స్ యజమా నులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం.

ఎ.రామిరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా




హోటల్‌లో కుళ్లిన చికెన్ చూపుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ (ఫైల్) .. మరగకాచిన నూనె వాడుతున్న దృశ్యం



నమాజ్‌లో ఆరోగ్య రహస్యాలు

గణపవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం విధిగా నిర్ణయించిన ఆరాధన విధా నాల్లో మొట్టమొదటిది నమాజ్. ముస్లింలు ప్రతీరోజు ఐదుపూటలా ఆచరించే నమాజ్‌లో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. నమాజ్ సమస్త శారీరక, మానసిక రుగ్మతలకు దివ్యౌషధం. నమాజ్ చేసేటప్పుడు అనుసరించే వివిధ శారీరక భంగిమల వల్ల శ్వాస నియంత్రణ జరిగి ఏకాగ్రత ఏర్పడుతుంది. యోగా శాస్త్రంలో పతంజలి నిర్వహించిన యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ప్రత్యాహార ధారణ, ధ్యానం, సమాధి అనే అష్టాంగ మార్గాలు కూడా దీనినే చెబుతున్నాయి. నమాజ్‌లోని వివిధ భంగిమల ద్వారా చేకూరే ప్రయోజనం ఏమిటో తెలుసుకుందాం..

తక్‌బీర్ ఏ తహ్రీమా



ఈ భంగిమలో తిన్నగా నిలబడి రెండు చెవుల కింద భాగాలను తాకుతూ తలను పైకెత్తి తిరిగి కిందకు దించుతారు. ఈ భంగిమలో ప్రాణాయామం ఆచరించవచ్చు. తలపైకి ఎత్తినప్పుడు శ్వాసను గాఢంగా పీల్చుకుని (పూరకం) కొన్ని క్షణాల నుంచి (కుంభకం) తల కిందికి దించుతున్నప్పుడు శ్వాసను మెల్లిగా వదులుతారు.. ఈ భంగిమ ద్వారా ప్రాణశక్తిని వృద్ధి పరుచుకుని రక్తశుద్ధి చేసుకోవడం ద్వారా శరీర శక్తిని పెంచుకోవచ్చు.

ఇఖామత్



తిన్నగా నిలబడి మనస్సును కేంద్రీకరించడం నమాజ్‌లో మొదటి భంగిమ. దీన్ని ఇకామత్ అంటారు. యోగాతో పోలిస్తే సమస్థితి వంటిది. సాధారనంగా మనలో చాలా మంది ఒంటి కాలిపై శరీరం బరువు మోపి నిలబడుతుంటారు. దీని వల్ల కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉంది. ఇకామత్‌లో (సమస్థితి) రెండుపాదాలపై శరీర బరువును సమానంగా ఉంచి నిటారుగా నిలబడతారు. తల, మెడ, వెన్నుముక నిటారుగా ఉండటం వల్ల వెన్నుముక సమస్యలుండవు.

రుకూ



ముందుకు వంగి రెండు చేతులతో మోకాళ్లను పట్టుకోవడం, తిరిగి పైకి లేవడాన్ని యోగాసనాల్లో పాద హస్తాసనంతో పోలుస్తారు. వెన్ను పాము మృధుత్వంగా ఉంటుంది. మోకాలి చిప్పలను గట్టిగా పైకిలాగి నొక్కిపెట్టడం వల్ల తొడలు శక్తివంతంగా ఉంటాయి. మలబద్ధకాన్ని తొలగిస్తుంది. ముందుకు వంగినప్పుడు శ్వాసను వదలటం, పైకిలేచినప్పుడు శ్వాస పీల్చడం క్రమబద్ధంగా చేస్తే ప్రాణయామ ప్రక్రియ కూడా తోడై రక్తశుద్ధి ద్విగునీకరణం అవుతుంది.

సజ్జదాహ్



ఇందులో శశంక భంగిమ దాగి ఉంది. పొట్టలోని అవయవాలన్నీ పాంక్రియాస్, కాలేయం, చిన్నపేగు, పెద్దపేగులను ఈ భంగిమ నియంత్రిస్తుంది. ఫలితంగా ఆయా అవయవాలు వాటి విధులను నిర్విఘ్నంగా కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. పొట్టపైభాగపు కండరాలు గట్టిపడి తగిన శక్తి లభిస్తుంది. ముఖ్యంగా నాడి మండలానికి సంబంధించిన నరాలన్నిటినీ ఇది ఉత్తేజ పరుస్తుంది.


ఖయోదా



ఇది వజ్రాసన తరహా భంగిమ. ధ్యాన భంగిమ కూడా. నేత్రసంబంధమైన వ్యాధులను ఇది నిర్మూలిస్తుంది. తీసుకున్న ఆహారాన్ని తేలిగ్గా జీర్ణం చేయగల శక్తి ఈ భంగిమకు ఉంటుంది. అజీర్తి రోగులకు ఈ భంగిమ వరంలాంటిది.

అల్‌ఖయామ్

రెండు చేతులను పొట్టపై ఉంచి తిన్నగా నిలబడే ఈ భంగిమలో శ్వాసను మెల్లిగా వదిలి పొట్టను సాధ్యమైనంత వరకు లోనికి పోని స్తారు. దీని వల్ల పొట్టలోని కొవ్వు పదార్థం కరుగుతుంది. గ్యాస్ట్రిక్ సమస్య నుంచి విముక్తి లభిస్తుంది.




ఉండిలో చురుగ్గా ఆర్వోబీ పనులు

ఉండి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉండిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుకుగా సాగు తున్నాయి. 2025 ఫిబ్రవరి నెలాఖారున పనులు చేపట్టారు. 2020 జనవరి 6న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు కేంద్రమంత్రి గడ్కరీ రిమోట్ కంట్రోల్ ద్వారా శ్రీకారం చుట్టారు. 165 జాతీయరహదారిలో 1.35 కిలోమీటర్లు మేర రూ.90 కోట్లతో చేపట్టారు. 2022లో పనులు నిలిచిపోయాయి. భీమవరం, గణపవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఉండి మీదుగా ఆకివీడు, కైకలూరు, ఏలూరు, గుడివాడ, విజయవాడ, తిరుపతి, హైదరాబాదు వెళ్తుంటాయి. తరుచూ రైల్వేగేటు వేయడంతో వాహనదారులు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. నిలిచిపోయిన ఆర్వోబి పనులకు తిరిగి రు.38 కోట్లు మంజూరు చేసినట్లు సమాచారం. ఆర్వోబికి సంబంధించి మరో ఖానా నిర్మించడానికి అక్కడ వున్న రైల్వే క్యాబిన్‌ను తొలగించినట్లు తెలిసింది. ఆర్వోబి పనులపై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యేరఘు రామకృష్ణరాజులు ప్రత్యేక దృష్టి పెట్టి కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు.

ప్రయాణికులకు ఇబ్బందులు



ఓవర్‌బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తిచేయాలి. రైల్వే ట్రాక్ డబుల్ లైన్ కావడంతో తరుచూ గేటు పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఓవర్ బ్రిడ్జి పూర్తయితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయి.

కె.శ్రీనివాసరావు, ఉండి

సకాలంలో పూర్తిచేయాలి



రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి. రైల్వేగేటు వేస్తే ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్వోబీని సకాలంలో పూర్తిచేయాలి.

-పి.రాము,ఉండి

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియార్టీ సవరణ జాబితా

ఏలూరు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మునిసిపాల్టీలు, ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు సంబంధించి సవరించిన సీనియార్టీ జాబితాలను గురువారం ఉమ్మడి జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)గా రూపొందించి విడుదల చేయడంతోపాటు వాటిపై అందిన అభ్యంతరాలను పరిష్కరించిన విద్యాశాఖ తాజాగా సవరించిన జాబితాలను www.deoeluru.org వెబ్‌సైట్, ఏలూరు డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉందన్నారు. సవరించిన జాబితాలపై అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలు, సాక్ష్యాలు, ఉపాధ్యాయుడి పూర్తి వివరాలతో ఈనెల 25లోగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయం, కాకినాడ ఆర్జేడీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అభ్యంతరాలను ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోవడంతోపాటు సంబంధిత ఉపాధ్యాయునికి తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఏలూరులోని ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు, తదితర కార్యకలాపాలకు 'టిస్'నే ప్రామాణికంగా తీసుకోనున్న విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలో అన్ని కేడర్ల ఉపాధ్యాయులు మొత్తం 11,388 మందితోకూడిన సీనియార్టీ జాబితాలను ఇటీవలే విడుదల చేయగా, వాటిపై అందిన అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం సవరించిన జాబితాలను తాజాగా విడుదల చేశారు.

తానా సభలకు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు ఆహ్వానం

భీమవరంటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని మిచిగన్‌లో జూలై మూడు నుంచి ఐదో తేదీ వరకు నిర్వహించే తానా సభలకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను తానా అసోసియేషన్ చైర్మన్ గంగాధర్ నాదెళ్ల కార్యవర్గం సభ్యులు ఢిల్లీలో గురువారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తానా అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో తానా కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్రా, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, ఎన్‌ఆర్‌ఐలు చెందు, శశి, బీజేపీ ఏపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం తదితరులు ఉన్నారు.



ఆహ్వాన పత్రం అందుకుంటున్న మంత్రి వర్మ

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

» సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్ బాగుండాలంటే యువత ఆలోచనల్లో మార్పు రావాలని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరగనున్న సాంకేతికోత్సవంలో భాగంగా టెక్ యుఫోరియా-2కే25ను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్ అనుసరిస్తున్న విధానం వల్ల మన వాళ్లు మనకు వీసా వస్తుందో రాదో అని ఆందోళన చెందుతున్నారని కానీ వెన్నెముక వంటి యువత తలచుకుంటే అమెరికా దేశస్థులే ఇండియన్ అంబసి ముందు వీసాల కోసం నిల్చునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి పేరూరి బాలకాశీయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చుక్కా అప్పారావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రుద్రమ్మ కోట, కూనవరం గోదావరి రేవు పాట

ఆదాయం రూ.78.60 లక్షలు

వేలేరుపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరాలకు గానూ వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట, అల్లూరిజిల్లా కూనవరం మధ్యగల గోదావరిపై పడవను తిప్పుకునేందుకు గురువారం వేలంపాట నిర్వహించగా ఆదాయం రూ.78.60 లక్షలు వచ్చింది. కూనవరంలో నిర్వహించిన వేలంపాటలో కూనవరం, వేలేరుపాడు, వీఆర్‌.పురం మండలాల నుంచి తొమ్మిది మంది వేలంలో పాల్గొనగా వేలేరుపాడు మండలానికి చెందిన బీరబోయిన కోటేశ్వరరావు పాటను దక్కించుకున్నారు. తొలుత వేలంపాటలో కొంత గందరగోళం నెలకొంది. పడవరేవు ఆదాయాలు రుద్రమ్మకోట, కూనవరం గ్రామ పంచాయతీలు సమానవాట దక్కించుకుంటాయి. గత ఏడాది గడిచిన కాలానికి రేవుపాట నిర్వాహకులు రూ.16లక్షలు బకాయి పడగా రుద్రమ్మకోట గ్రామ పంచాయతీకి ఈ సొమ్ములు చెల్లించలేదు. ఈమేరకు రుద్రమ్మకోట గ్రామ పంచాయతీ అధికారులు తమ పంచాయతీకి రావాల్సిన వాటా సొమ్మును పూర్తిగా చెల్లించిన తరువాతే వేలంపాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. చివరకు చర్చల ద్వారా ప్రస్తుత పాటదారుల నుంచి బకాయిలు వసూలు చేసి రుద్రమ్మకోట పంచాయతీకి చెల్లిస్తామని కూనవరం పంచాయతీ అధికారులు హామీ ఇవ్వగా పాటను కొనసాగించారు. ఈ వేలం పాటలో 78.60 లక్షలకు కోటేశ్వరరావు పాటను దక్కించుకున్నారు. గత ఏడాది ఈ రేవుపాట రూ.80.02 లక్షలకు పోగా ప్రస్తుతం వేలంపాట కొంతమేర తగ్గింది. కార్యక్రమంలో కూనవరం, రుద్రమ్మకోట సర్పంచ్‌లు హేమంత్‌కుమార్, స్వర్ణలత, కూనవరం ఎంపీపీ సాంబశివరావు, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాధవాయిపాలెం రేవు పాట

నరసాపురం రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవు పాటకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. గురువారంతో డిపాజిట్ల గడువు ముగిసింది. మొత్తం 15 మంది షెడ్యూల్ కొనుగోలు చేశారు. అయితే డిపాజిట్ రూ.33 లక్షలను ఎనిమిది మంది డీడీల రూపంలో ఇచ్చారు. వీరు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే పాటలో పాల్గొనున్నారు. నిబంధనల ప్రకారం ముందుగా బహిరంగ వేలంపాట నిర్వహిస్తారు. ఆ తరువాత సీక్రెట్ టెండర్లను తెరుస్తారు. ఈ రెండింటిల్లో ఎవరూ హెచ్చు మొత్తంలో పాడు కుంటే వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పాట ప్రారంభంకానుంది. గతంలో ఎన్నడూ ఇంతమంది పాటదారులు షెడ్యూళ్లు కొనుగోలు చేసినా దాఖలాలు లేవు. ఈసారి పాట రికార్డు స్థాయిలో వెళ్లవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభ ధరనురూ 3.13 కోట్లుగా నిర్ణయించారు. పాటను ఖరారు చేయాలంటే దీనికంటే హెచ్చు మొత్తంలో పాడాల్సి ఉంటుంది. లేనిపక్షంలో రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ ఇస్తారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని యూనియన్ నాయకులు ఎస్‌ఈకి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆర్.శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావు, కె.మల్లేశ్వరరావు మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో విద్యుత్‌శాఖ సీఎండీ రాష్ట్ర నాయకులతో చేసుకున్న లిఖితపూర్వక ఒప్పందంలోని హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్స్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4,500 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోతున్నారన్నారు. యూనియన్ నాయకులు జి.దుర్గారావు, డి.శంకరఅప్పారావు, ఎ.అప్పలరాజు, కె.శ్రీధర్, వి.నారాయణ, కె.శ్రీనివాసరావు, కె.వెంకట్రావు, కె.మురళి పాల్గొన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్లకు చెందిన విద్యుత్ మీటర్ రీడర్స్ ప్రతినిధులు ధర్నాలో పాల్గొన్నారు.



ఏలూరు ఎస్‌ఈ కార్యాలయం వద్ద నాయకుల ధర్నా

నిధుల దుర్వినియోగం కేసులో ఉద్యోగి అరెస్ట్

భీమవరం క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. ఆ కేసులో నిందితుడైన అప్పటి జూనియర్ అసిస్టెంట్ గుండు రామకృష్ణను గురువారం భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య అరెస్ట్ చేసి రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ కాళీచరణ్ తెలిపారు.

నెరవేరిన 30 ఏళ్ల కల

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ప్రభుత్వం ఆమోదం

» సీఎం చంద్రబాబు చొరవ వల్లే సాధ్యమైంది.. ఎస్సీలోని ఒక వర్గం ఉపకులాల హర్షం

ఏలూరుటూటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం జై కొట్టింది. శాసనసభ, శాసనమండలిలో గురువారం ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందింది. ఈ వర్గీకరణ సీఎం చంద్రబాబునాయుడు చొరవ వల్లే సాధ్యమైందని ఎస్సీలోని ఒక వర్గం ఉపకులాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీ వర్గీకరణపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చింది. 1994లో ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ కల 30 ఏళ్ల తరువాత ఫలించింది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని అమలు చేయాలని బిల్లులో పేర్కొన్నారు. 2026 జనాభా లెక్కల తరువాత జిల్లా యూనిట్‌గా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తారు. వర్గీకరణకు ముందు కొన్ని ఉపకులాలకు లబ్ధి చేకూరలేదు. ముఖ్యంగా మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందలేదని ముప్పై ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటానికి కూటమి ప్రభుత్వం ముగింపు పలికింది. ఈ వర్గీకరణ వల్ల బడుగు, బలహీన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించింది. ఈ వర్గీకరణతో మంద కృష్ణమాదిగ సుదీర్ఘపోరాటం ఫలించడంతో ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

సమాజంలో అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజమే లక్ష్యంగా 1997 జూన్ 6న అనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించి ఉత్తర్వులు ఇచ్చి అమలు చేశారు. దీనిపై కొన్ని వర్గాలు సుప్రీంకోర్టుకు వెళ్లగా వర్గీకరణ చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో వర్గీకరణకు బ్రేక్‌పడింది. వర్గీకరణ అమలైన నాలుగేళ్లలో మాదిగ, ఉపకులాలకు 22 వేలకుపైగా ఉద్యోగాలు వచ్చాయి. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన కాలంలోనే వర్గీకరణ చేయడం విశేషం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబరులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రాతో ఏకసభ్య కమిషన్‌ను నియమించారు. ఉమ్మడి 13 జిల్లాల్లో కమిషన్ తిరిగి ప్రజలు అభిప్రాయాలు తీసుకున్నాక 59 ఉపకులాలను 3 కేటగిరీలుగా విభజించి కమిషన్ రిపోర్టు ఇచ్చింది.

ఉపకులాల శాతం ఇలా..

రిపోర్టు ప్రకారం కూటమి ప్రభుత్వం బిల్లు తయారు చేసి రెల్లితో సహా 12 ఉపకులాలకు ఒక శాతం, మాదిగతో సహా 18 ఉపకులాలకు 6.5శాతం, మాలతో సహా 25 ఉపకులాలకు 7.5శాతం రిజర్వేషన్లను పంచారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కూడా వర్గీరణ సీఎం వల్లే సాధ్యమైందని ప్రశంసించడం గమనార్హం.

దళితుల పక్షపాతి చంద్రబాబు



ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం పట్ల సీఎం చంద్రబాబు దళితుల పక్షపాతిగా నిజాయతీని నిరూపించుకున్నారు. ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం జరుగుతుంది. ఎస్సీలోని ఉపకులాలకు సమాన అవకాశాలు లభిస్తాయి.

– కందుల రమేశ్
ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

వర్గీకరణ వల్ల సమన్యాయం



ఎస్సీ వర్గీకరణ వల్ల ఉపకులాలన్నింటికి సమన్యాయం జరుగుతుంది. ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ జరగకముందు కొన్ని కులాల వారే లబ్ధి పొందారు. మిగిలిన కులాలన్నీ రిజర్వేషన్ ఫలాలు అందుకోలేక పోయారు. ఇప్పుడు అటువంటి వారికి న్యాయం జరుగుతుంది.

– తలపాల రవిమాదిగ,
అడ్వకేట్, ఎమ్మార్పీఎస్ నాయకుడు

సామాజిక న్యాయం సాధ్యం



ఎస్సీ వర్గీకరణ వల్ల సామాజిక న్యాయం జరుగుతుంది. 30 ఏళ్ల సుదీర్ఘపోరాటం ఫలించింది. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం ఈ వర్గీకణ ఫలితం. వర్గీకరణకు సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం చారిత్రాత్మకం.

– బొల్లపల్లి మురళి
ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు

అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యం

విద్యా, ఉద్యోగం, ఆర్థికం, సామాజిక బలంగా అభివృద్ధి చెందడానికి ఎస్సీ వర్గీకరణ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా వెనకబడిన మాదిగ ఉపకులాలు అభివృద్ధికి ఉపయోగకరం. ఎస్సీ వర్గీకరణ ఆర్థికంగా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ ఇవ్వాలని అంబేడ్కర్ ఆలోచనకు ఈ వర్గీకరణ నిలువుటద్దం

– బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు

నేటినుంచి హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్

ముస్తాబైన రుస్తుంబాద లేసు ట్రేడింగ్

నరసాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌కు మండలంలోని రుస్తుంబాద అంతర్జాతీయ లేసు ట్రేడింగ్ సెంటర్ ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌కు దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన హస్త కళల ఎక్స్‌పోర్టర్లు పాల్గొంటున్నారు. ట్రేడింగ్ సెంటర్‌లో 70కిపైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జమ్మూకశ్మీర్, బిహార్, తెలంగాణ, ఆంధ్రా, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన సుమారు 200 మంది ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ జరగనుంది. దేశంలో ప్రసిద్ధిగాంచిన హ్యాండీక్రాఫ్ట్స్, ఫ్యాషన్ జ్యూయలరీ, గృహోపకరణాలు, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, హ్యాండ్ బ్యాగ్స్ వంటివి ప్రదర్శించనున్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే నాయకర్ విచ్చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారు. గురువారం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద సెంటర్‌ను పరిశీలించారు. ఏర్పాట్లను ట్రేడింగ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసీ, రాకేష్ శర్మ, కలవకొలను తాతాజీ, రాజీవ్, మాదాసు గోపాలకృష్ణ, పులపర్తి ప్రతాప్, కావలి నాని పరిశీలించి సూచనలు అందించారు.



అంతర్జాతీయ లేసు ట్రేడింగ్ సెంటర్



ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఏలూరు ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్న తులు ఇవ్వాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రేషనలైజేషన్ పేరుతో క్లస్టర్ విధానంలో పరిణామాలపై కలెక్టర్‌కు వివరించారు. క్లస్టర్ విధానం పేరుతో రెవెన్యూ విలేజ్‌లకు సంబంధం లేకుండా రెండు సచివాలయాలకు కలిపి ఒక్క క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం వల్ల పనిభారం పెరిగి రెవెన్యూ సేవలు ఆలస్యమవుతాయన్నారు. త్వరలో జరిగే కలెక్టర్ సదస్సులో క్లస్టర్ విధానంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఏలూరు డివిజన్ అధ్యక్షులు సాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజయరాయి సదస్సులో సంఘీభావం వ్యక్తం చేస్తున్న రైతులు

'కోకో'కు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలి

పెదవేగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కోకో పంటకు ధరల స్థిరీకరణ పథకాన్ని అమలు చేసి, ఆదుకోవాలని కోకో రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయరాయి శివారు గాంధీనగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో గురువారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు సంస్థలు సిండికేట్‌గా మారి, రైతులను ముంచుతున్నాయని, ఈ సమయంలో ప్రభుత్వమే గింజలను కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల్లో కోకో సాగు జరుగుతుండగా మనదేశం 20వ స్థానంలో ఉందని, దేశ అవసరాలకు 80శాతం కోకోను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో రూ.1040కు కొనుగోలు చేసి, ఈ ఏడాది సంస్థలు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేశాయని ఆరోపించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ కోకో రైతులు సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సదస్సులో విజయరాయి ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత, పెదవేగి ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ ఏరియా ఆయిల్‌పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, పలు జిల్లాలనుంచి వచ్చిన రైతులు పర్వతనేని గంగాధరరావు, బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు మాట్లాడారు.

24, 25 తేదీల్లో ధర్నా, రాస్తారోకోలు

కోకో గింజల కొనుగోలు సమస్యపై ఈనెల 24,25 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కోకో గింజల కొనుగోలు కేంద్రాల ఎదుట ధర్నాలు, రాస్తారో కోలు నిర్వహించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందించాలని పిలుపునిచ్చారు.

26 నుంచి గుంటూరులో వ్యవసాయ ప్రదర్శన

పెనుమంట్ర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు లాం ఫాంలో ఈనెల 26 నుంచి 28 వరకు ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన జరుగుతుందని మార్టేరు వరి పరిశోధనా కేంద్రం ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం పరిశోధన కేంద్రంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన కేంద్ర వ్యవసాయశాఖ, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతుందని, దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొంటారన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో సాగుచేస్తున్న వరి పంట పూత దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్ మొదటి వారం నుంచి కోతలు మొదలవుతాయన్నారు. డాక్టర్ ఎం .గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) గోదావరి మండలం సాగులో ఉన్న పలు రకాల గుణగణాలు, ప్రత్యామ్నాయ రకాలను వివరించారు.

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

ఏలూరు జిల్లాలో గురువారం వేర్వేరుచోట్ల నలుగురు మృతి చెందారు. భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదని ఏలూరుకు చెందిన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, పాత చింతలపూడికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందారు. రైలు ఢీకొని కృష్ణా జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందగా, రైలు నుంచి జారిపడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వృద్ధుడు మృతి చెందాడు.

భార్య పుట్టింటికెళ్లి రావడం లేదని..

» ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న పొన్నాడ దుర్గా మల్లేశ్వరరావు(40)కి భార్య శివదుర్గ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెలూన్ షాపు నిర్వహిస్తున్నారు. మద్యానికి బానిసైన అతడు తరచూ భార్యతో గొడవపడడంతో ఆమె పది రోజుల క్రితం పుట్టినిల్లు భీమడోలుకు వెళ్లిపోయింది. ఆమె ఎంతకీ రావడంలేదని మనస్తాపంతో గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

చింతలపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ పాత చింతలపూడికి చెందిన విశ్రాంత ఉద్యోగి డి. హేమప్రకాష్(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయనకు గుండె నొప్పి వచ్చిందని కుమారులు చింతలపూడి ఏరియా ఆసుపత్రికి గురువారం ఉదయం తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారని ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు మోహన్‌ప్రకాష్ తన అన్నది గుండె పోటుకాదని, కొడుకులు తన అన్నను కొట్టి చంపివేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

క్రైమ్ సమాచారం

రైలు ఢీకొని ఒకరు..

ఏలూరు క్రైం : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి మృతదేహం రైల్వే పోలీసులకు లభించింది. కృష్ణా జిల్లా వేల్పూరు గ్రామానికి చెందిన నంబూరి రవికుమార్ (57) ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ దగ్గరలో రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో గురువారం వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రైలు పట్టాలు దాటుతుండగా మరణించాడా, రైలు నుంచి జారి పడ్డాడా, మరే ఇతర కారణంతో మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వృద్ధుడు జారిపడి మృతి చెందాడు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన అంబటి సుబ్బారెడ్డి (69) విజయవాడ నుంచి విశాఖపట్టణం వైపు వెళ్లే సింహాద్రి రైలులో గురువారం ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తెను పంపించమని అడిగినందుకు

అత్త చేతి వేళ్లను కొరికిన అల్లుడు

కలిదిండి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అత్త చేతివేళ్లను కొరికిన అల్లుడిపై కేసు నమోదైంది. కైకలూరు మండలం ఆచవరం గ్రామానికి చెందిన జంగం తిరుపతమ్మ (45) బుధవారం గుర్వాయిపాలెంలో ఉంటున్న అల్లుడు బందెల జోజిబాబు ఇంటికి వచ్చి కూతురిని పుట్టింటికి పంపించమని అడిగింది. అందుకు కోపోద్రిక్తుడైన అల్లుడు అత్త కుడి చేతి వేళ్లను గట్టిగా కొరికేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో తిరుపతమ్మను వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కైకలూరు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కొడుతున్నాడని..

» భార్య, కుమార్తె ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త నిత్యం మద్యం తాగుతూ తనను, కుమార్తెను కొడుతున్నాడని మనస్తాపంతో తాడేపల్లిగూడెంలో భార్య, కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం కొబ్బరి తోటకు చెందిన లక్కదాసు వెంకటేశ్వరరావు మద్యం సేవిస్తూ ఇంట్లో భార్య నాగభూషణమ్మ, కుమార్తె హర్షిణిలను కొడుతూ చిత్ర హింసలు పెడుతున్నాడు. ఈ మేరకు జీవితంపై విరక్తితో భార్య, కుమార్తె ఇద్దరూ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గుర్తించి ఇద్దరిని తాడేపల్లిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మహిళలపై ఆగని లైంగిక దాడులు

లైంగిక వేధింపులకు పాల్పడ్డ పార్టీ నేత.. ఇద్దరికి రాజీ కుదిర్చిన మరో నాయకుడు

భీమవరం క్రైం, : భీమవరం పట్టణంలో మహిళలపై లైంగిక దాడులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవల వైసీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం అదే పార్టీకి చెందిన మరో నాయకుడు భర్త లేని మహిళ పట్ల లైంగిక వేధింపుల ఘటన తెరపైకి వచ్చింది. కొంతకాలంగా భర్త లేని మహిళ ఒంటరితనాన్ని చూసి వేధింపులకు గురిచేస్తూ ఉండడంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం. దీంతో మూడో పట్టణానికి చెందిన ఒక నాయకుడు ఇద్దరిని పిలిపించి గొడవను సర్దుబాటు చేసి రాజీ కుదిర్చినట్టు తెలిసింది. గతంలో కూడా ఈ విషయంపై రాజీ జరిగినట్టు సమాచారం. దీనిపై బాధిత మహిళ గురువారం ఫిర్యాదు చేసిందని సీఐ ఎం.నాగరాజు తెలిపారు.



శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన

ఏలూరు క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, యువతులు, విద్యార్థినులు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా పోలీసులకు తెలియజేయాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రతను మెరుగుపర్చేందుకు ప్రత్యేకంగా శక్తి యాప్‌ను రూపొందించారన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

చింతలపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ నుంచి రుణాలు పొందడానికి ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, బీసీ, కాపు, ఈబీసీలు ఆధార్, కుల ధృవీకరణ, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డుతో ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి నిత్యావసరాల అందజేత

దెందులూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చేయూత సంస్థ ద్వారా ప్రతి నెలా ఒక పేద కుటుంబానికి సాయం చేస్తున్నట్టు చేయూత సంస్థ సభ్యులు మేకా లక్ష్మీ నారాయణ, తాతా సూరిబాబు, ఏనుగు రామకృష్ణ అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామానికి చెందిన పోతురాజు దేవమణి అనే క్యాన్సర్ బాధిత మహిళకు రూ.12 వేల నగదుతో పాటు నిత్యావసరాలను చేయూత సభ్యులు పరసా నాగార్జున, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాగార్జున, సంస్థ సభ్యులు కలిసి అందజేశారు.

ఆశ్రంలో ఎంబీబీఎస్ అత్యుత్తమ ఫలితాలు

ఏలూరు టూటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆశ్రం మెడికల్ కళాశాలలో 2024సంవత్సరానికి ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు నమోదు చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ తెలిపారు. డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన వార్షిక పరీక్షల్లో పలువురు విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఎంబీబీఎస్ ఫైనలీయర్ పార్ట్ వన్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా పార్ట్ టూలో 92శాతం ఉత్తీర్ణత నమోదు చేశారన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ విభాగం 125 మంది పరీక్షలకు హాజరైతే 121మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అంజిరెడ్డి, సీఈవో డాక్టర్ కె.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఆశ్రం డైరెక్టర్ జీ.రతీదేవి విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఆర్టీసీ రక్షణ కోసం 24న ఢిల్లీలో భారీ ప్రదర్శన

ఏలూరు కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఆందోళన బాటపట్టారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24న ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళన పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను తీసుకొచ్చి భవిష్యత్తులో ఆర్టీసీని కనుమరుగు చేయాలని కేంద్ర ప్రభుత్వం పథకం వేసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడి ఆర్టీసీని కాపాడుకోవాలని, ఈ మేరకు ఢిల్లీలో 24న నిర్వహించే భారీ ప్రదర్శన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.సుందరయ్య పాల్గొన్నారు.

షిర్డీ సాయి ప్రేమ మందిర్ వార్షికోత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని శ్రీ షిర్డీ సాయి ప్రేమమందిర్ ఆరవ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సాయి సేవా మాలాధారణ స్వీకరించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. మధ్యాహ్న హారతి నిర్వహించారు. ఈ ఉత్సవాలు 24వ తేదీ వరకు కొనసాగుతాయని తాతారావు పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలను విద్యుత్ తోరణాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

విద్యుదాఘాతంతో అర ఎకరం కోకో తోట దగ్ధం

పెదవేగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతం కోకో తోట దగ్ధమైంది. రైతులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన గిత్తా సత్యనారాయణకు 20ఎకరాల్లో కోకో తోట ఉంది. గురువారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మంటలు చెలరేగి కోకో తోటను కమ్మేశాయి. గమనించిన రైతు సత్యనారాయణ వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో పాటు చుట్టుపక్కల రైతుల సహకారంతో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అప్పటికే అరెకరం కోకో తోట కాలిపోయింది. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్టు రైతు తెలిపారు.ఏలూరు అగ్నిమాపకశాఖాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు.

బాధితుడికి మానవత ఆర్థిక సాయం

పోలవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి) :ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్‌కి గురై ఇబ్బందులకు గురవుతున్న పట్టిసీమ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలికి గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పూనెం పోశిబాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి తమవంతు సాయంగా ఐదువేల రూపాయల అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కన్వీనర్ ఆకుల నరసింహమూర్తి, కో చైర్మన్ చిలకా రాంబాబు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రానికి చిన్నారుల తరలింపు

జంగారెడ్డిగూడెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మారు తండ్రి కొట్టిన ఘటనలో గాయపడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులను గురువారం ఏలూరు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా తెలిపారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు చికిత్స అందించిన అనంతరం గురువారం డిశ్చార్జ్ చేశారు. పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది, ఏలూరు సిడబ్ల్యూసి ముందు హాజరుపరిచినట్లు బ్యూలా తెలిపారు.

27 నుంచి గుంటూరులో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

ఏలూరురూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని ఆచార్య ఎన్.జి. రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో 27 నుంచి 29వ తేదీ వరకు దక్షిణ భారతీయ ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్ తెలిపారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, యాంత్రీకరణ, డ్రోన్‌ల వినియోగం తదితర అంశాల ప్రదర్శనతోపాటు రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనకు రైతులను ఉచితంగా తీసుకువెళ్తామని, ఔత్సాహిక రైతులు ఏరువాక కేంద్రాన్ని(99896 23804) సంప్రదించాలని అన్నారు.

ఆటోలకు లౌడ్ స్పీకర్లు బిగిస్తే కఠిన చర్యలు

ఏలూరు క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో గురువారం రవాణా శాఖ వాహనతనిఖీ అధికారి ఎస్.బి.శేఖర్ తన సిబ్బందితో ఆకస్మికంగా ఆటోలను తనిఖీ చేశారు. రవాణా శాఖ ఉపరవాణా కమీషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. నగరంలో ఆటోలలో స్పీకర్లను పెట్టుకుని పెద్ద శబ్దాలతో వెళ్తున్నారని అంతేకాకుండా ఆటోలకు ఎల్ఈడీ ఫోకస్ లైట్లు పెట్టి ఎదుటి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని రవాణా శాఖ డీటీసీకి ఫిర్యాదు అందడంతో తనిఖీలు చేపట్టారు. 60కిపై ఆటోల్లో లౌడ్ స్పీకర్‌లను, ఎల్ఈడీ ఫోకస్ లైట్లను తొలగించడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్.సి ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన మాదాసు లక్ష్మి భర్త అదే గ్రామానికి చెందిన బుద్దాల అప్పారావుకు చెందిన ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బుద్దాల వీర్రాజుకు అప్పారావుకు పొలం తగాదాలు ఉండడంతో అప్పారావుకు చెందిన పొలంలో విద్యుత్ తీగలు, విద్యుత్ మోటారును, పొగాకు పంటను బుద్దాల వీర్రాజు ధ్వంసం చేసి నష్టం కలిగించడంతో గ్రామ పెద్దల్లో పెట్టారు. ఈ నెల 19న వీర్రాజు పొలం వచ్చి మాదాసు లక్ష్మి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను వీపుపై కొట్టి గాయపరచి బోరు ధ్వంసం చేశాడు. దీంతో ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

బాలల సంక్షేమానికి భాగస్వాములు కావాలి

ఏలూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తోందని, జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న బాలల సంక్షేమ, రక్షణ సమన్వయ కమిటీలో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జె.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో కె.హెరాల్డ్ బాబు అధ్యక్షతన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సీడబ్ల్యూసీ ఇన్‌చార్జ్ చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కార్యదర్శి నేతల రమేష్ బాబు మాట్లాడుతూ కలిసి పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

అక్కడి వరకు వెళ్లలేం..

పోలవరం నుంచి పోలీస్ స్టేషన్ దూరాభారం - అవుట్ పోలీస్ స్టేషన్ కావాలంటూ పలువురి విజ్ఞప్తి

పోలవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి) : పోలవరానికి అవుట్ పోలీస్ స్టేషన్ లేకుండా పోయింది. మండల కేంద్రంలో అవుట్ పోలీస్ స్టేషన్ లేకపోవడంతో ఎల్.ఎండి. పేట, గూటాల, మహాలక్ష్మీ దేవిపేట గ్రామాల నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఫిర్యాదుదారులు పోలవరం రావాల్సి వస్తోంది. అలాగే పోలీస్ స్టేషన్ పోలవరానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉండటంతో రాత్రైనా, పగలైనా నడవక తప్పడం లేదు.

రాకపోకలకు ఇబ్బందులు...

మండలంలో ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకునే సరికే కాలాతీతం అవుతోంది. పోలీస్ స్టేషన్ నుంచి పోలవరం రావడానికి ఒకే మార్గం ఉంది. ఆ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో పక్కనున్న పంటపొలాల విషపు పురుగులు రోడ్డు మీదకు వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



పోలవరం గ్రామానికి దూరంగా ఉన్న పోలీస్ స్టేషన్

రాత్రిళ్లు పోలీస్ స్టేషన్ నుంచి పోలవరం చేరుకోవడానికి ఇబ్బందిగా ఉంటోందని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పోలవరంలో అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు.

ఇద్దరికి పనిష్మెంట్ బదిలీలు!

ఏలూరు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న అభియోగాలపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరిని పనిష్మెంట్ కింద బదిలీలు చేశారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేస్తూ, సంబంధిత ఉద్యోగులిద్దరినీ తక్షణమే విధులనుంచి రిలీవ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంమేరకు హెల్త్ అసిస్టెంట్(మేల్)లుగా పనిచేస్తున్నవారి సర్వీసులను రెగ్యులరైజేషన్ చేయడానికి మార్గదర్శకాలున్నాయి. ఆ ప్రకారం 2014 జూన్ రెండో తేదీని ప్రామాణికంగా తీసుకుని అంతకుముందు ఉద్యోగం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఈ క్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్(మేల్) ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్‌చేయడానికి నిర్దేశిత కటాఫ్ సంవత్సరం, నెల, తేదీ తర్వాత కూడా కొందరు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించడానికి ప్రతిపాదించడం, వీరిలో కొందరికి రిటైర్మెంట్ వయస్సు 60ఏళ్లు దాటిఉండటం, తదితర నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా గుర్తించి ఒక జూనియర్ అసిస్టెంట్‌ను యర్రగుంటపల్లి పీహెచ్‌సీకి, ఒక సూపరింటెండెంట్‌ను పాడేరు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆఫీసుకు పనిష్మెంట్‌కింద బదిలీచేశారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో సంబంధిత క్రమబద్ధీకరణ ఫైలును నడిపింది డిప్యూటేషన్‌పై ఏళ్లతరబడి కార్యాలయంలో తిష్టవేసిన ఓ ఉద్యోగికాగా, బదిలీవేటుమాత్రం ఇతరులపై పడిందని సమాచారం. దీనిపై ఉద్యోగులిద్దరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు తెలిసింది. చర్యలపై డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని గురువారం వివరణ కోరగా ఇవేవీ తన దృష్టికి రాలేదన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

ఏలూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సారా రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దేందుకు వివిధ శాఖల అధికారులు ఐక్యంగా పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సారా నిర్మూలన నవోదయం 2.0కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ మేరకు కరపత్రాలను ఎస్పీ కేవీఎస్ కిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. రెండు నెలలు పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై అనుబంధ శాఖలు దృష్టి సారించాలన్నారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ 141 మద్యం దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలను పోలీస్ కార్యాలయం, కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, డీఎఫ్‌వో శుభమ్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, సూపరింటెండెంట్ ఆవులయ్యలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడండి : జడ్పీ చైర్‌పర్సన్

ఏలూరుసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏలూరు జడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులతో జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ సమీక్ష నిర్వహించారు. భీమడోలు మండలంలోని ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పర్యటించగా ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీటి కొరతను ప్రస్తావించారని ఈ సందర్భంగా పద్మశ్రీ పేర్కొన్నారు. ఆగడాలలంక కాలువ ద్వారా తాగునీటి ట్యాంకులు నింపేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ ఎస్ఈని కోరారు. దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ సానుకూలంగా స్పందించి మంగళవారం నాటికి ఆగడాలలంక కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు జిల్లా పరిషత్ ద్వారా ప్రత్యేక నిధులను కేటాయించేందుకు కృషి చేస్తానని పద్మశ్రీ ప్రసాద్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, డిఈ, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

కొండవాగులపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలి



బూరుగువాడ కొండవాగు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుల బృందం

బుట్టాయగూడెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న కొండవాగులపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం మండలంలోని కోర్సవారిగూడెం, అంతర్వేదిగూడెం, బుట్టాయగూడెం, లక్ష్మడుగూడెం, జైనవారిగూడెం పంచాయతీల్లో ప్రజా చైతన్య యాత్ర కొనసాగింది. నాగమణి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో కొండవాగులపై నేటికి కల్వర్టులు, వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బుట్టాయగూడెం, పోలవరం మండలాల కార్యదర్శులు తెల్లం రామకృష్ణకారం భాస్కర్‌లు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏకు గిరిజన ఉప సంచాలకులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరావు, చుండ్రు బుల్లెమ్మకె.భీమరాజు, ఎస్.సాయికృష్ణ, టి.శాంతి, కూరం సత్యన్నారాయణ దొర, పి.అక్కమ్మ పాల్గొన్నారు.

వీటి సంగతేంటి?

రోడ్డుపైనే ఉన్న పూడిక మట్టి కుప్పలు

చింతలపూడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో నెల రోజులుగా సాగుతున్న డ్రెయినేజీ పూడిక తీత పనులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందుగా ఓపెన్ డ్రెయినేజి అంటూ గతంలో రోడ్డు భవనాల శాఖ వేసిన రాళ్లను తొలగించారు. ఓపెన్ డ్రెయిన్‌గా ఉండాలని అధికారులు ఆదేశాలిచ్చారు.ఆ తరువాత రోడ్డుకు ఇరుపక్కలా పెట్రోలు బంకు నుంచి కొత్త బస్టాండ్ వరకు డ్రెయినేజీలో పూడిక మట్టిని తొలగించి డ్రెయిన్ పక్కనే కుప్పలుగా పోశారు. 15 రోజులు దాటినా మట్టి కుప్పలను తొలగించ లేదు.ఫలితంగా మట్టి తిరిగి డ్రెయిన్లలోకి జారుతోంది. పూడిక మట్టి ఆరాలంటూ 15 రోజులు దాటినా తొలగించకపోవడంతో దుకాణదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే పార్కింగ్‌కు స్థలం లేదు. ఇప్పుడు ఈ డ్రెయిన్ పక్కన మట్టి కుప్పలు వేయడంతో వాహనాలు రోడ్డుపైనే పెట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు పూడిక మట్టిని త్వరగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపైనే ఉన్న మట్టి కుప్పలు

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి : సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణరాజ్

లింగపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ అన్నారు. లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మండలంలో యడవల్లి, కలరాయనిగూడెం గ్రామాల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై ఇంచార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఇంచార్జ్ తహసీల్దార్ ప్రసాద్, రీసర్వే డీటీ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం

పోలవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చెరుకూరి శ్రీనివాస్‌కి గురువారం కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు ఎంపీడీవోకి సంఘం క్యాలెండర్లు, డైరీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గంగరాజు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, జుత్తిక శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఇ.శ్రీనివాస్, కార్యదర్శి రాజారావు, సిబ్బంది సుభాష్, మాడుగుల నాగేశ్వరరావు, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది



వినూత్నంగా ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

అడవులను రక్షించుకుందాం..

ఏలూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల కోసం అడవులను రక్షించుకుందామంటూ చిన్నారులు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భవిష్యత్ తరాల కోసం అడవులను రక్షించుకుందామంటూ చెట్టు వద్ద సేవ్ ది ఫారెస్ట్ అంటూ గురువారం ప్లకార్డులతో ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతీ ఒక్కరూ పుట్టిన రోజు, పర్వదినాల్లో కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని సూచించారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

లింగపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో కొన్నిరోజులుగా జరుగుతున్న సరమ్మపేరంటాలుతల్లి తిరునాళ్ల సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయనవెంట గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జయ్య, ఎం.ప్రసాద్, టి.రాధాకృష్ణ, సి.హెచ్.రామ్మోహనరావు, బి రాంబాబు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న పోలీసులు

నిందితులను అరెస్టు చేయండి

యువకుడి మృతిపై గ్రామస్థుల ఆందోళన

జీలుగుమిల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దాడిలో తాటియాకులగూడేనికి చెందిన గంధం బోసు మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో బోసు మృత దేహం పోస్టుమార్టం అనంతరం ఖమ్మం నుంచి ఇంటికి తీసుకు వస్తున్న సమయంలో గురువారం రాత్రి మృతుడి కుటుంబీకులు, స్థానికులు ఆందోళనకు దిగారు. గ్రామ సమీప ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మృతదేహంతో వస్తున్న అంబులెన్స్‌ను స్థానికులు నిలిపివేశారు. జాతీయ రహదారిపై గంటసేపు ధర్నా చేశారు. పోలీసులు గత మూడు రోజులుగా విచారణ పేరుతో నేరస్తుల్ని అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నరన్నారు.పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరరావు, సీఐలు బాలసురేష్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్సైలు పి.నవీన్‌కుమార్, చంద్రశేఖర్‌లు గ్రామస్థులకు నచ్చజెప్పి మృత దేహాన్ని అంబులెన్స్‌లో ఇంటికి తరలించారు. ఈ కేసుపై పూర్తి విచారణ జరుపుతున్నామని పోలవరం డీఎస్పీ తెలిపారు.



సాయం అందజేస్తున్న డీబీఆర్సీ కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెదపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : తాళ్లగూడెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బాధితుడు బేతాళ మోహన మోజేష్ కుటుంబానికి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సాయం అందజేశారు. సెంటర్ ప్రతినిధి గోసాల ఝాన్సీరాణి గురువారం పరామర్శించి రెండు టార్పాలిన్లు, 25 కేజీల బియ్యం, చీరలతో పాటుగా 10 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు.అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని అధికారులు అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ, సుమలత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చంటి

అమ్మవారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

ఏలూరుకార్పొరేషన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): నూకాలమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. కొత్తపేటలో ఉన్న నూకాలమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈనెల 28వ తేదీ వరకు జరిగే మహోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు ఎం.రామకృష్ణ యోగానంద శాస్త్రీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక స్నాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రంగా సత్యనారాయణ, ఈవో మీసాల వెంకట్రావు, టీడీపీ నాయకులు వందనాల శ్రీనివాస్, త్రిపర్ణ రాజేష్, జంపా సూర్యనారాయణ, పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అత్యాచారాలు పెరిగిపోయాయని బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి కె రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు గ్జేవియర్ నగర్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని గురువారం సాయంత్రం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు బాలికలకు అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి

చింతలపూడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : బోయగూడెం నుంచి శెట్టివారిగూడెం మీదుగా సీతానగరం రోడ్డు మరమ్మతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వెంకటాపురం మాజీ సర్పంచ్ ఆది సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. 20ఏళ్లుగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్టీసీ బస్సులు కూడా తిరగడంలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక 20 కోట్లు మంజూరు చేశారని, అయినా పనులు నత్తనడకలా సాగుతున్నాయని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వాయిదాపడిన మహాజనసభ

టి.నర్సాపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం సొసైటీ మహాజనసభ కోరంలేక వాయిదా వేసినట్టు సహకార సంఘ ఆఫీషియల్ కమిటీ చైర్‌పర్సన్ మాధవీ మూర్తి తెలిపారు. టి.నర్సాపురం సొసైటీ సహకార రత్న రైతు ప్రాంగణంలో గురువారం నిర్వహించ తలపెట్టారు. ఈ మేరకు మాధవీ మూర్తి మాట్లాడుతూ సహకార సంఘంలో సుమారు 3,120 మంది సభ్యులుండగా అందులో కేవలం 13 మంది మాత్రమే హాజరు కావడంతో సభను వాయిదా వేసినట్టు తెలిపారు.మరలా ఎప్పుడు నిర్వహిస్తామో తేదీని రైతులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి డీసీసీబీ బ్యాంకు మేనేజర్ చిట్టిబొమ్మ శ్రీనివాస్, సూపర్‌వైజర్ కె.రామకృష్ణ, సొసైటీ కార్యదర్శి ఎం.అగస్టిన్ పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి సంతాపం

టి.నర్సాపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు తెలిపారు. రాజుపోతేపల్లి గ్రామంలో గురువారం అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త గుంజాల సత్యనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు మద్దిపాటి దుర్గారావు, కేసిన వెంకటేశ్వరరావు, బొంతు వెంకట శ్రీనివాసరావు, నెక్కలపూడి రామచంద్రరావు, దేవరపల్లి శ్రీను పాల్గొన్నారు.

కృష్ణాపురంలో చలివేంద్రం

టి.నర్సాపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఉపాధ్యాయురాలు భూక్యా నాగమణి తెలిపారు. టి.నర్సాపురం పంచాయతీలోని కృష్ణాపురం పంచముఖ హనుమాన్ ఆలయం సెంటర్‌లో బంజారా బజరంగభేరి భూక్యా గోపయ్య, సక్రమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బోడా ధృత్విక్ నాయక్ గురువారం ప్రారంభించారు. మొదటి రోజు బాటసారులకు,పాఠశాల విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ వేసవి దాహార్తిని తీర్చడానికే ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణుగోపాల్, భూక్యా బిగన్నాథం, తేజవసు వెంకన్న, భూక్యా కృష్ణా, భూక్యా నాగరాజు, భూక్యా ధనలక్ష్మి, భద్రమ్మ, జరబల రామకృష్ణ పాల్గొన్నారు.

మండల కార్యాలయం వద్ద..

లింగపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఇన్చార్జి తహసీల్దార్ ఎన్.వి.డి.వి.ప్రసాద్ చలివేంద్రం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వారికి ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

ముండూరులో ఉచిత వైద్యం

పెదవేగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : తడికలపూడి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముండూరు సొసైటీ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏలూరు శంకర్ నేత్రాలయం నేత్ర వైద్యశాల, ఏలూరు కామినేని హాస్పటల్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని మానవత తడికలపూడి శాఖ అధ్యక్షుడు, తాళ్లగోకవరం సర్పంచ్ నెక్కలపూడి సురేష్ ప్రారంభించారు. కామినేని హాస్పటల్ వైద్యులు డాక్టర్ కొడాలి రాంప్రసీన్, డాక్టర్ వై.నిచ్చల్, శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ దివ్య రవళి ఈ శిబిరంలో వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బీవీఎస్వీ ప్రసాదరావు, మానవతా సంస్థ కన్వీనర్ ఆళ్ల విజయ్ గోపాల్, చైర్మన్ గంగాధర ప్రసాద్, కార్యదర్శి శివ నాగ మల్లేశ్వరరావు, వంగపండు శ్రీనివాసరావు, నల్లూరు కాంతారావు, జాదం నరేష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

జంగారెడ్డిగూడెం,మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కృష్ణప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు.



విగ్రహాన్ని తాకిన సూర్య కిరణాలు

అమ్మవారిపై సూర్య కిరణాలు

ఉంగుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని గురువారం సూర్యకిరణాలు తాకాయి. అరుదుగా సంభవించే ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


చోరీలకు పాల్పడిన నిందితులను చూపుతున్న సీఐ కృష్ణ, ఎస్ఐ వెంకటకుమార్

నకిలీ బంగారం తాకట్టు

షాపులో బెదిరించి రూ.1.50 లక్షలు చోరీ.. ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

కైకలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బంగారపు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ నెల 13న కైకలూరులోని మహాలక్ష్మీ గోల్డ్‌ఫైనాన్స్ షాపునకు గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు వెళ్లి నకిలీ బంగారపు బ్రాస్ లైట్లను తాకట్టు పెట్టి రూ.90 వేలు నగదు తీసుకువెళ్లారు. కొద్దిసేపు అయిన తర్వాత మరో కొంత బంగారాన్ని తాకట్టు పెట్టేందుకు ప్రయత్నించారు. షాపు యజమాని శివవర ప్రసాద్‌కు అనుమానం వచ్చి వారిని గట్టిగా ప్రశ్నించారు. దీంతో వారి వద్ద ఉన్న బటన్ చాకును చూపించి రూ.1.50 లక్షలను బెదిరించి తీసుకువెళ్లారు. షాపు యజమాని దిలీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గురువారం కైకలూరులోని కోరుకొల్లు రోడ్డులోని సీఐ కృష్ణ, ఎస్సై వెంకటకుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎరుపురంగు కారులో ప్రయణిస్తున్న ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నెల్లూరు జిల్లా జలదంకి మండలం రామవరప్పాడుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు, కావలికి చెందిన ఉన్నం చంద్రమోహన్, విజయనగరం జిల్లా మెంటాడకు చెందిన చొక్కాపు మణికంఠగా గుర్తించి వారిని అరెస్టు చేసి రూ.88 వేలు నగదు, నాలుగు నకిలీ బంగారపు చైన్లు, నాలుగు బ్రాస్‌లైట్లు, 3 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన బటన్ చాకు, కారును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కైకలూరులో రెండు బంగారపు దుకాణాల్లో చోరికి పాల్పడినట్లు గుర్తించి వీరిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ వెల్లడించారు.


స్వాధీనం చేసుకున్న నకిలీ ఆభరణాలు, నగదు, చాకు


గరికిముక్కు సుబ్బయ్యను ఘనంగా సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గరికిముక్కు సుబ్బయ్యకు ఘన సత్కారం

కైకలూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖకు చెందిన అంబేడ్కర్ ఫౌండేషన్ అఖిల భారత బోర్డు సభ్యుడిగా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా కైకలూరు మండలం రామవరానికి చెందిన గరికిముక్కు సుబ్బయ్యను నియ మించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కైకలూరు రామకృష్ణ సేవాసమితిలో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక, సామాజిక సమరసత వేదిక, సమరసతసేవా ఫౌండేషన్ పలు సంస్థలు సుబ్బయ్యను ఘనంగా సత్కరించారు.ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల జాషువా, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమకిషోర్, కిసాన్‌సంఘ్ రాష్ట్ర కార్యదర్శి చక్రధరరావు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహక మేడిశెట్టి పాములు, పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం అమ్మేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడింది. అయితే రైసు మిల్లుల్లో, గ్రామాల్లోని వ్యాపారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడటంతో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలా వద్దా అన్న సందిగ్ధతను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 కేజీల బస్తా ఒకిటికి రూ.1725లుకు కొనుగోలు చేయాలి. పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడంతో ప్రైవేట్ వ్యాపారులు బస్తా రూ.1600 వరకు అడుగుతున్నారు. బస్తాకు రూ.125 నష్టపోవాల్సి వస్తోంది.


కాకరవాడలో పోత పోస్తున్న ఖరీఫ్ ధాన్యం

ప్రభుత్వమే కొనాలి



రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తామంటున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

- కాగిత నాగబాబు, రైతు, కాకరవాడ

వివరాలు పంపాం

రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమాచారం ఉన్నతాధికారులకు పంపాం. మండలంలో ఉన్న పరిస్థితిని వివరించాం. ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు రావాల్సి ఉంది.

- వేణుమాధవ్, ఏవో

చర్యలు తీసుకుంటున్నాం

ధాన్యం కొనుగోళ్ళకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యాక వాటితోపాటు ముదినేపల్లి ప్రాంతంలోని ఖరీఫ్ ధాన్యం కొంటాం.

- విజయ్, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్


జనార్దనవరంలో సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం దృశ్యం

సారా రహిత గ్రామాలే లక్ష్యం

చాట్రాయి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య అన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చాట్రాయి, జనార్దనవరం, ఆరుగొలనుపేట, తుమ్మగూడెం, సోమవరం తదితర గ్రామాల్లో సారా నిర్మూలపై సదస్సులు, ప్రచారం వాహనంలో మైక్ ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేశామని ఎవరైనా సారా తయారు చేసినా అమ్మినా తమకు సమాచారం అందిస్తుందని అన్నారు. ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉపాధి వేతనాలు విడుదల చేయాలి

చాట్రాయి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు ఐదు వారాల వేతనాలను విడుదల చేయాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నంపేటలో గురువారం పనిప్రదేశంలో ఉపాధి కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకుని మాట్లాడారు.ఉపాధి వేతనాలు ఒక్క రూపాయి కూడా పడకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డబ్బులు వారి ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు వారం వారం పే స్లిప్పులు ఇవ్వాలని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు ఇచ్చి పని ప్రదేశంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్‌ను నియమించాలని కోరారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి 200 రోజులు పనులు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు.

ఉప్పుటేరు తీర గ్రామాల్లో తాగునీటికి పాట్లు

గోదావరి నీరు అందించాలని వినతి

కలిదిండి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాకు సరిహద్దున ఉన్న ఉప్పుటేరు తీర గ్రామాల్లో గోదావరి నీటితో శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరు తున్నారు. కొండంగి, పల్లిపాలెం, యడవల్లి దళితవాడ, మట్టగుంట, బోడ్డువానిగట్టు, పెదలంక, పల్లిపాలెం, అప్పారావుపేట, పెదపుట్లపూడి గ్రామాల్లో సుమారు 22 వేల మంది నివసిస్తున్నారు. తాగటానికి గుక్కెడు నీరు లేక వీరంతా అవస్థలు పడుతున్నారు. తాగునీటి చెరువులు అడుగంటితే తాగునీటి వంతు ఎప్పటికీ ఇస్తారో తెలియదు. ఇచ్చినా వారం రోజులే ఇస్తుండటం తో తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోలేకపోతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. చెరువులను నింపడానికి వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ చేయకుండా సరఫరా చేయడంతో చాలామంది ప్రైవేట్ వాటర్ ప్లాంట్లలో కొనుగోలు చేసి తాగుతున్నారు. స్థోమత లేని పేదలు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. కాగా పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు లాకుల వద్ద నుంచి పెదలంక వరకు సుమారు 15 కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటు చేస్తే శాశ్వ తంగా తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించుకున్నారు. ఏలూరుపాడు లాకుల వద్ద గోదావరి జలాలు ఏడాది పొడవునా పుష్కలంగా ఉంటా యి. చెరువులు అడుగంటినప్పుడల్లా పైపులైన్ ద్వారా తోడుకోవచ్చు. కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం సమర్పించారు.


పెదలంకలో మోటారు పంపులతో తాగునీటి చెరువును నింపుతున్న దృశ్యం

గోదావరి జలాలను సరఫరా చేయాలి



ఏలూరుపాడు లాకుల వద్ద ఉన్న గోదావరి జలాలను పైపులైన్ ద్వారా కొండంగి, మట్ట గుంట, పెదలంక పంచాయతీ చెరువులను నింపితే తాగునీటి సమస్య పరిష్కారమవు తుంది. జిల్లాకు శివారు గ్రామాలు కావడంతో నీటి వంతు సక్రమంగా రావడం లేదు.

- అంగ్రాజు రత్నమణి, సర్పంచ్, మట్టగుంట

22 వేల మంది జనాభాకు వరం



పైపులైన్ ఏర్పాటు చేస్తే ఉప్పుటేరు తీర గ్రామాల్లో నివసిస్తున్న 22 వేల మందికి వరమవుతుంది. దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. చెరువుల్లో నీరు తాగటానికి ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లో నీరు తాగుతున్నాం.

- టి.జ్యోతి, సర్పంచ్, కొండంగి

అత్త చేతివేళ్లను కొరికిన అల్లుడు

కలిదిండి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అత్త చేతివేళ్లను కొరికిన అల్లుడిపై కేసు నమోదైంది. ఆచవరానికి చెందిన జంగం తిరుపతమ్మ (45) బుధవారం గుర్వాయిపాలెంలోని అల్లుడు బందెల జోజిబాబు ఇంటికి వచ్చి కూతురిని పుట్టింటికి పంపించమని అడిగింది. అందుకు కోపోద్రిక్తుడైన అల్లుడు అత్త కుడి చేతి వేళ్లను గట్టిగా కొరికేశాడు. తీవ్ర రక్తస్రావం అవడంతో ఆమెను కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్వ్యూ..

ప్రగతి పథంలో స్వచ్ఛాంధ్ర

ఐ.విజయలక్ష్మి, ఎంపీడీవో, చాట్రాయి



● **మండలంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రగతి ఎలా ఉంది?**

జవాబు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఇళ్ల నుంచి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నాం. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

● **ఈ పథకం అమలుకు తీసుకుంటున్న చర్యలేవి ?**

జవాబు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఐదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న 18 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునః ప్రారంభించాం. 8 కేంద్రాలలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరుగుతున్నాయి.

● **వేసవిలో తాగినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు ?**

జవాబు: అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి బోరు,చేతి పంపులు మరమ్మతులు చేస్తున్నాం.

● **పథకాల అమలు ఎలా?**

జవాబు: ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకులాల నిర్మాణం పూర్తికాగా మరికొన్ని గ్రామాల్లో జరుగుతున్నాయి.

లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఎంపీపీ సత్యనారాయణ

ముదినేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు వైద్యఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖల అధికారులు సమిష్టి కృషి చేయాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల వయసు నిండిన బాలికలకు, గర్భిణులకు లింగ నిర్ధారణ స్కానింగ్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌పై అధికారులు తనిఖీలు జరపాలన్నారు. తహసీల్దార్ సుభానీ, ఎంపిడివో రామకృష్ణ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ, పోలీసు సిబ్బంది, మండల పరిషత్ ఏవో రమణారావు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ


సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో లెక్కిస్తున్న సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.14.34 లక్షలు

ముదినేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గత 90 రోజులకు వచ్చిన కానుకలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.12.54 లక్షలు, అన్నదాన హుండీ ద్వారా రూ.1.80 లక్షలు మొత్తం రూ.14.34 లక్షలు వచ్చినట్టు ఈవో గంగాశ్రీదేవి తెలిపారు. బంగారం 16 గ్రాములు, వెండి 600 గ్రాములు వచ్చాయి. శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వ రరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట ఆరబోసుకునేందుకు కల్లాలు కరువు

చాట్రాయి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో పంటలు ఆరబోసుకోవటానికి కల్లాలు కరువై రైతులు అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక శ్మశాన వాటికలు, చెరువు లోతట్టు ప్రాంతాలు, అడవులలో పంటలు ఆరబోసుకోవడానికి రైతులు ప్రమాదాలతో సహవాసం చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఇళ్ల పక్కనే స్థలాలు, బంజరు భూములు, ఖాళీ స్థలాలు అధిక విస్తీర్ణంలో ఉండడం వల్ల పంటలు ఆరపోసుకునేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. గ్రామాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోవడం, భూములకు రేట్లు ఆకాశాన్ని అంటడం వల్ల ఖాళీ స్థలాలు కూడా గృహాలతో నిండిపోయాయి. బోరుబావులు వినియోగం, ప్రాజెక్టులు నిర్మాణం వల్ల సాగు నీటి లభ్యత పెరిగి భూములు అన్నీ పంట భూములయ్యాయి. దీంతో కల్లాలు కరువయ్యాయి. 15 ఏళ్ల క్రితం చాట్రాయిలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం అప్పటి తిరువూరు ఏఎంసీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కృషితో ఎకరం స్థలం కేటాయించారు. తరువాత ప్రభుత్వ అనుమతులు రాకపోవడంతో యార్డు నిర్మాణం జరగలేదు. యార్డు నిర్మాణం జరిగితే అందులోని ప్లాట్ ఫారమ్స్‌పై పంటలు ఆరబోసుకునేందుకు రైతులు ఆశించారు కానీ నెరవేరలేదు. చాట్రాయిలో మార్కెట్ యార్డు అందులో పంటలు ఆరబోసేందకుఉ ప్లాట్‌ఫారమ్స్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


శ్మశానంలో ఆరబోసిన మొక్కజొన్న కండెలు

హామీల అమలు రాష్ట్రకమిటీ ఛైర్మన్‌గా కైకలూరు ఎమ్మెల్యే

కైకలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలు కమిటీ ఛైర్మన్‌గా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను నియమించారు. గురువారం అసెంబ్లీలో ఈ మేరకు కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. కామినేని కమిటీ ఛైర్మన్‌గా మరో ఆరుగురు సభ్యులుగా ఉంటారని ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోని అంశాలపై కమిటీ చేసిన సిఫార్సులను అమలులోకి తీసు కుంటారు. కామినేనికి ఛైర్మన్ పదవి ఇవ్వడం పట్ల నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక అసమానతలకు చరమగీతం

నూజివీడు టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుతో సామాజిక అసమానతలకు చరమగీతం పాడినట్టేనని నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి అన్నారు.గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడంపై ఆమె హర్షం వ్యక్త చేశారు. సహకరించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, రాష్ట్ర ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

చాట్రాయి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరుకానున్నారని టీడీపీ మండలాధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి తెలిపారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేస్తారని, నాయకులు కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

కైకలూరు బార్ అసోసియేషన్ ఏకగ్రీవం


ఉదయశంకర్

కైకలూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కైకలూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గురజాడ ఉదయశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో బార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది గురజాడ ఉదయశంకర్, ఉపాధ్యక్షుడిగా రాగాని సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి కుమ్మరికుంట కోటయ్య, సహాయ కార్యదర్శి బోడావుల ఇందిరా, కోశాధికారి గురుకుల జితేంద్రబాబు, గ్రంథాలయ కార్యదర్శి రజీమున్నీ,క్రీడా కార్యదర్శి అడ్డగర్ల శాంతిస్వరూప్, సాంస్కృతిక కార్యదర్శి సరిపల్లి రత్నరాజు, మహిళా ప్రతినిధిగా కనుమూరి రమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపు ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 22న జరుగనుంది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.

వాడపల్లికి ప్రత్యేక బస్సు

మండవల్లి మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నుంచి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతీ శనివారం ఉదయం 5 గంటలకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రాంప్రసాద్ తెలిపారు. భక్తుల ఇబ్బందులను ఏలూరు డిపో డీపీటీవో వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి బస్సు ఏర్పాటు చేశారని తెలిపారు.

31 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వరహాపట్నంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 31 వరకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గేట్ పరీక్షల్లో ప్రతిభ

నూజివీడుటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) గేట్ పరీక్షలలో రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్‌అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబరిచినట్టు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దాదాపు 400 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. వీరిలో వెయ్యి లోపు ర్యాంకులు సాధించిన వారు 30 మంది ఉన్నారన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఉపాధి కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్ కోరారు. గురువారం అక్కిరెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసి, ఛైర్మన్‌లను ఉత్సవ విగ్రహాలుగా ఉంచి, నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. అధికారం చేపట్టిన పది నెలల్లో కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలను కూటమి ప్రభుత్వం ఇస్తుండడం చంద్రబాబు పాలన దక్షతకు నిదర్శమన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకునేందుకు ఈనెల 22తేదీ వరకు మాత్రమే సమయం ఉందన్నారు. బీసీ కులస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదేళ్లలో రూ.1600 కోట్ల శ్రీనిధి నిధుల వినియోగం

ఏలూరు టూటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) :గత ఐదేళ్లలో శ్రీనిధి నిధులు రూ.1641 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో గురువారం ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి సుశ్రీ శోభ సమాధానం ఇచ్చారు.ఆత్మనిర్భర్‌లో భాగంగా సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ.50 వేల కోట్ల ఈక్విటీ ఇన్‌ఫ్యూషన్ కేంద్రం ప్రకటిస్తే దాంట్లో కేంద్రం వాటా రూ.10వేల కోట్లు, ప్రైవేటు ఈక్విటీ వెంచర్ కాపిటల్ ఫండ్స్ ద్వారా రూ.40 వేల కోట్లు వినియోగించామన్నారు. శ్రీనిధి పథకంలో రాష్ట్రంలో మూడు కంపెనీలు ఉన్నాయన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.10,979 కోట్లు కేంద్రం ఆర్థిక సాయం అందించిందన్నారు.

లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ తనిఖీలు

లింగపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ అన్నారు. లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మండలంలో యడవల్లి, కలరాయనిగూడెం గ్రామాల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై ఇంచార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ముసునేరు మండలం గోపవరానికి చెందిన వల్లభనేని గోపాలకృష్ణ 2017లో ప్రభుదాస్ అనే వ్యక్తికి రూ.ఐదు లక్షలు అప్పుగా ఇచ్చారు. బాకీ తీర్మానం నిమిత్తం ప్రభుదాస్ చెక్కు ఇవ్వగా బ్యాంకులో నగదు లేదని చెక్కు తిరిగివచ్చింది. ఈ మేరకు బాధితుడు వల్లభనేని గోపాలకృష్ణ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేసును విచారించిన న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి నిందితుడుకి ఆరు నెలల జైలుశిక్ష రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

సారా అమ్ముతున్న మహిళపై కేసు

ముసునూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సారా అమ్మకాలు చేస్తున్న మహిళపై ఎక్సైజ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముసునూరులో జరిగిన దాడుల్లో అక్రమంగా సారా అమ్మకాలు చేస్తున్న కుప్పాల మంగమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.నిందితురాలిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ముందడుగు వేయాలి

నూజివీడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అసమానతలపై విద్యార్థినులు, మహిళలు అవగాహనతో ముందడుగు వేయాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహంలో గురువారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏమైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న క్రమంలో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు సదరు విషయాలను తెలపాలలన్నారు. మహిళా న్యాయవాది నండూరి పద్మాంజలి, ఎం.వెంటకరమణ తదితరులు పాల్గొన్నారు.